www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | శనివారం,సెప్టెంబర్ 26,2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:202 | పేజీలు: 8 | వెల: రూ.5/-

ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు

భారత ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటర్ల జాబితా అత్యంత కీలకమైనది. ఈ జాబితా కచ్చితంగా, పారదర్శకంగా ఉండటం ఎన్నికల నిష్పక్షపాతానికి పునాది. ఈ క్రమంలో, జాబితాలో అనర్హుల పేర్లను చేర్చడాన్ని నిరోధించడానికి లేదా ఇప్పటికే ఉన్న అనర్హుల పేర్లను తొలగించడానికి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) పౌరులకు ఒక ముఖ్యమైన సాధనాన్ని అందించింది. అదే 'ఫారం 7'. దీని ద్వారా ఓటర్ల జాబితాలోని ఏదైనా పేరుపై అభ్యంతరం వ్యక్తం చేయవచ్చు లేదా తొలగింపు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.ఒక నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాలో నమోదైన ఏ ఓటరైనా, అదే జాబితాలోని మరో వ్యక్తి పేరుపై అభ్యంతరం తెలుపుతూ ఫారం 7ను దాఖలు చేయవచ్చు. దరఖాస్తుదారు తన పూర్తి వివరాలు (పేరు, ఓటరు గుర్తింపు కార్డు నంబర్, చిరునామా, ఫోన్ నంబర్) అందించాలి. అలాగే, ఎవరి పేరునైతే తొలగించాలని కోరుతున్నారో వారి వివరాలు, తొలగింపునకు గల కారణాన్ని స్పష్టంగా పేర్కొనాలి.

మతతత్వ శక్తులను వ్యతిరేకించడమే

నిజమైన నివాళి

- కేరళలోని నీలంబూరులో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా అవార్డు
- తెలంగాణలో సంక్షేమ పథకాలకు గుర్తింపుగా ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వెల్లడి

సీఎం రేవంత్ రెడ్డికి 'ఆర్యదాన్ మొహమ్మద్' ఉత్తమ ప్రజాసేవ అవార్డు

హైదరాబాద్,సెప్టెంబర్25సామాన్యుడి అస్త్రం



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ మొహమ్మద్ ఉత్తమ ప్రజాసేవ పురస్కారం-2026' అందుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేరళ మాజీ మంత్రి దివంగత ఆర్యదాన్ మొహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం కేరళలోని నీలంబూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా రేవంత్ రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు.తెలంగాణలో రైతులు, బడుగు బలహీన వర్గాలు, సామాన్య ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమ, ప్రజాస్వామ్య విలువల పట్ల ఉన్న నిబద్ధతను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆర్యదాన్ మొహమ్మద్ ఫౌండేషన్ ప్రకటించింది. ఈ అవార్డు కింద లక్ష రూపాయల నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. ఎంపీ బెన్నీ బెహనాన్, కేరళ మంత్రి ఏపీ అనిల్ కుమార్, ప్రముఖ మేధావి కల్పేట నారాయణన్ సభ్యులుగా ఉన్న జ్యూరీ రేవంత్ రెడ్డిని ఈ పురస్కారానికి ఎంపిక చేసింది.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు లౌకిక శక్తులన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. మతతత్వ శక్తులను వ్యతిరేకించడమే ఆర్యదాన్ మొహమ్మద్‌కు అసలైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశంలో ఓట్ల దొంగతనం, పార్టీల దొంగతనం, నిధుల దొంగతనం జరుగుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం దేశ యువత భవిష్యత్తును దొంగిలిస్తోందని విమర్శించిన ఆయన, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఓడించాలని ప్రజలను కోరారు.

నేరాల అడ్డా నుంచి రక్షణ ఉత్పత్తుల

కేంద్రంగా మారిన యూపీ

- యూపీ తయారీ బ్రహ్మోస్ క్షిపణులతో పాకిస్థాన్‌కు కంటి మీద కునుకు లేదు: అమిత్ షా
- అమేథీ ఏకే-203 రైఫిళ్లు నక్సలైట్లను వణికిస్తున్నాయన్న అమిత్ షా
- భారత్ రక్షణ ఉత్పత్తుల విలువ రూ.లక్ష కోట్లు దాటింది
- దాదాపు 80 దేశాలకు రక్షణ పరికరాలు ఎగుమతి చేస్తున్న భారత్



న్యూఢిల్లీ,సెప్టెంబర్25సామాన్యుడి అస్త్రం

ఉత్తరప్రదేశ్‌లో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులను మిగులుస్తున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. దేశ రక్షణ ఉత్పత్తుల తయారీలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కీలక కేంద్రంగా ఎదుగుతోందని ఆయన పేర్కొన్నారు. గ్రేటర్ నోయిడాలో శుక్రవారం జరిగిన 'ఉత్తరప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన' (యూపీఐటీఎస్)ను ప్రారంభించిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.యూపీ డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా లక్నోలో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణుల గురించి అమిత్ షా ప్రత్యేకంగా ప్రస్తావించారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. అందులో భాగంగా, అమేథీలో తయారవుతున్న ఏకే-203 అసాల్ట్ రైఫిళ్ల నక్సలైట్లు, ఉగ్రవాదులకు సంతమీద కునుకు లేకుండా చేస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు.

ప్రశాంతంగా ముగిసిన

నిమజ్జనం

గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి



హైదరాబాద్,సెప్టెంబర్25,సామాన్యుడి అస్త్రం

హైదరాబాద్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన వేడుకలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకట హర మహాగణపతి'గా భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారి విగ్రహాన్ని వేలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు.ఉదయం 9.30 గంటలకు ఖైరతాబాద్ నుంచి మహాగణపతి శోభాయాత్ర వైభవంగా ప్రారంభమైంది. యాత్ర ప్రారంభంలో దానం నాగేందర్ గణనాథుడి ఎదుట డ్యాన్స్ చేసి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులు చేసిన నినాదాలతో పరిసర ప్రాంతాలన్నీ మార్మోగాయి.
ఈ శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది.

డీఎస్పీ భీమ్‌రెడ్డి ఆస్తుల కేసులో

బినామీలపై ఏసీబీ దాడులు

బిల్డర్ ఇంట్లో రూ.1.35 కోట్ల నగదు, విదేశీ కరెన్సీ స్వాధీనం

హైదరాబాద్,సెప్టెంబర్25,సామాన్యుడి అస్త్రం



ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన డీఎస్పీ భీమ్‌రెడ్డి వ్యవహారంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఆయన బినామీలే లక్ష్యంగా ఏసీబీ అధికారులు గురువారం ఏకకాలంలో పంజా విసిరారు. హైదరాబాద్, జహీరాబాద్‌లలోని పది ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి, రూ.400 కోట్ల ఆస్తులకు సంబంధించిన కీలక ఆధారాలను సేకరించారు.పుప్పాలగూడలో ఉండే బిల్డర్ వీరబొమ్మ వెంకటేష్ ఇంట్లో జరిపిన సోదాల్లో అధికారులు రూ.1.35 కోట్ల నగదుతో పాటు వివిధ దేశీ కరెన్సీ, 14 విదేశీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

శ్రీవారి దర్శనానికి భారీగా భక్తులు

- సర్వదర్శనానికి సుమారు 12 గంటల సమయం
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో నిండిపోయిన 31 కంపార్ట్‌మెంట్లు

తిరుమల,సెప్టెంబర్25,సామాన్యుడి అస్త్రం



తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం శ్రీవారి సర్వదర్శనం కోసం భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్నారు. దర్శన టోకెన్లు లేని భక్తులకు స్వామివారి సర్వదర్శనం లభించడానికి సుమారు 12 గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు.

రూ.39 లక్షలకు

బాలాపూర్ లడ్డూ

- ముగిసిన బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం
- దక్కించుకున్న సామ ప్రణీత్ రెడ్డి
- ఈసారి వేలంలో 9 మంది



హైదరాబాద్,సెప్టెంబర్25,సామాన్యుడి అస్త్రం

హైదరాబాద్ వినాయక ఉత్సవాల్లో ఎంతో ప్రత్యేకమైన బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం పాట ముగిసింది. ఈసారి లడ్డూకు భారీ ధర పలికింది. సాహెబ్‌నగర్‌కు చెందిన సామ ప్రణీత్ రెడ్డి రూ.39 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. దీంతో బాలాపూర్ లడ్డూ వేలంలో కొత్త రికార్డు నమోదైంది.ప్రతి ఏడాది బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలంపై భక్తుల్లో భారీ ఆసక్తి ఉంటుంది. ఈసారి కూడా లడ్డూను దక్కించుకునేందుకు 9 మంది భక్తులు వేలంలో పాల్గొన్నారు. ఒకరిని మించి మరొకరు బిడ్ పెంచడంతో వేలం ఉత్కంఠగా సాగింది. చివరికి రూ.39 లక్షల వద్ద సామ ప్రణీత్ రెడ్డి లడ్డూను సొంతం చేసుకున్నారు.లడ్డూను దక్కించుకున్న ప్రణీత్ రెడ్డిని ఉత్సవ నిర్వాహకులు, తోటి భక్తులు అభినందించారు.

హైదరాబాద్‌లో నకిలీ

వైద్యుడి అరెస్ట్

- గోల్కొండలో నకిలీ వైద్యుడిని అరెస్ట్ చేసిన పోలీసులు
- ఇంటర్ అర్హతతోనే రోగులకు వైద్యం అందిస్తున్న వైనం
- తల్లి, సోదరుడితో కలిసి క్లినిక్ నిర్వహిస్తున్న యువకుడు
- లేబుల్స్ లేని మందులు ఇస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం



హైదరాబాద్,సెప్టెంబర్25సామాన్యుడి అస్త్రం

హైదరాబాద్ నగరంలోని గోల్కొండలో వైద్య విద్యార్హత లేకుండా క్లినిక్ నిర్వహిస్తూ, నకిలీ డాక్టర్‌గా చలామణి అవుతున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంటర్మీడియట్ మాత్రమే చదివిన 23 ఏళ్ల అద్నాన్, తన కుటుంబ సభ్యులతో కలిసి అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో ఈ మోసానికి పాల్పడినట్లు పోలీసులు తమ కథనంలో వెల్లడించారు.పోలీసుల కథనం ప్రకారం.. గోల్కొండ ప్రాంతంలో అద్నాన్ అనే యువకుడు 'హిక్మా సెహత్ కేర్ సెంటర్' పేరుతో ఓ క్లినిక్‌ను నడుపుతున్నాడు.కేవలం ఇంటర్ (2018-2020) మాత్రమే పూర్తి చేసిన ఇతను, తన తల్లి సబా ఖాన్ (అలియాస్ మహమ్మది బేగం), సోదరుడు మహ్మద్ షెజాన్‌తో కలిసి తమను తాము వంశపారంపర్య హకీంలుగా (సాంప్రదాయ వైద్యులు) పరిచయం చేసుకున్నారు.

ఏపీలో మారిన పింఛన్ల పంపిణీ షెడ్యూల్

- అక్టోబర్ 1న మధ్యాహ్నం నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ
- బ్యాంకుల సెలవులు, సమ్మె కారణంగా మారిన షెడ్యూల్

అమరావతి,సెప్టెంబర్25,సామాన్యుడి అస్త్రం




ఏపీలో అక్టోబర్ నెలకు సంబంధించిన 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ సమయంలో స్వల్ప మార్పు చోటుచేసుకుంది. ప్రతి నెలా 1వ తేదీ ఉదయం ప్రారంభమయ్యే పింఛన్ల పంపిణీ, ఈసారి మాత్రం మధ్యాహ్నం నుంచి మొదలుకానుంది. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.

వంశధార, నాగావళికి పోటెత్తిన వరద

- భారీ వర్షాలతో వంశధార, నాగావళి నదులకు వరద ఉద్ధృతి
- గొట్టా బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

అమరావతి,సెప్టెంబర్25సామాన్యుడి అస్త్రం



భారీ వర్షాల నేపథ్యంలో ఉత్తరాంధ్రలోని ప్రధాన నదులైన వంశధార, నాగావళిలో వరద ఉద్ధృతి క్రమంగా పెరుగుతోంది. నదీ ప్రవాహం పోటెత్తుతుండటంతో అధికారులు ప్రధాన బ్యారేజీల వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఈ క్రమంలో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

మతతత్వ శక్తులను వ్యతిరేకించడమే నిజమైన నివాళి

మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశంలో ఓట్ల దొంగతనం, పార్టీల దొంగతనం, నిధుల దొంగతనం జరుగుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం దేశ యువత భవిష్యత్తును దొంగిలిస్తోందని విమర్శించిన ఆయన, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఓడించాలని ప్రజలను కోరారు.రాహుల్ గాంధీ తదుపరి భారత ప్రధాని అవుతారని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తును నిర్దేశించే రాజకీయ పోరాటం "గాంధీ పరివార్", "సంఘ్ పరివార్" మధ్యే జరుగుతోందని ఆయన అభివర్ణించారు. ఆర్ఎస్ఎస్ మతం, కులం, ప్రాంతం, భాషల పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తోందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ఈ దేశం సంఘ్ పరివార్ వైపు ఉంటుందా లేక గాంధీ పరివార్ వైపు ఉంటుందా అనేది తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం..

కేరళ రాజకీయాలకు దేశ రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఉందని సీఎం రేవంత్ అన్నారు. 'వాతావరణ నిపుణులు రుతుపవనాల కోసం కేరళ వైపు ఎలా చూస్తారో.. దేశ రాజకీయాలను అర్థం చేసుకునే విషయంలోనూ కేరళను ఒక సంకేతంగా చూడవచ్చు. 1991లో కేరళలో కరుణాకరన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పీవీ నరసింహా రావు ప్రధానమంత్రి అయ్యారు.భారత రాజకీయాలు1996లో కేరళలో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చిన తర్వాత ఢిల్లీలో కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోయింది. 2001లో ఏకే



ఆంటోనీ ముఖ్యమంత్రి కాగా, 2004లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఇప్పుడు (2026) కేరళలో కాంగ్రెస్ మళ్లీ విజయం సాధించడంతో కొత్త రాజకీయ గాలి మొదలవుతున్నది' అని విశ్లేషించారు.దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణత్యాగం చేశారని.. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ అధికారాన్ని, పదవులను త్యజించారని సీఎం తెలిపారు. ఇప్పుడు చరిత్ర పిలుస్తున్నదని, దేశానికి రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 'నాకు వ్యక్తిగత రాజకీయ ఆశలు లేవు. 2006లో క్షేత్రస్థాయి నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించాను. గత రెండు దశాబ్దాల్లో జెడ్పీటీసీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ, పీసీసీ అధ్యక్షుడిగా చేశాను. ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నాను. ఇక నా ముందున్న ఏకైక లక్ష్యం రాహుల్‌గాంధీని భారత ప్రధానమంత్రిగా చూడటమే' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

ప్రజా సంక్షేమానికి గుర్తింపుగా అవార్డు..

ఐదు దశాబ్దాలకుపైగా కాంగ్రెస్‌కు సేవలందించిన ఆర్యదాన్ మహమ్మద్ కేరళ రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని, ఆయన పేరుతో ఏర్పాటు చేసిన అవార్డును అందుకోవడం ఎంతో గౌరవంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాగా.. కేరళ కాంగ్రెస్ నేత, దివంగత ఆర్యదాన్ మొహమ్మద్ స్మారకార్థం ఆర్యదాన్ మొహమ్మద్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేసింది.అవార్డు కింద రూ. లక్ష నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. రైతులు, వెనుకబడిన వర్గాలు, ఇతర సామాజిక వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న విస్తృత కార్యక్రమాలను గుర్తిస్తూ సీఎం రేవంత్‌రెడ్డిని అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ తెలిపారు.

నేరాల అడ్డా నుంచి రక్షణ ఉత్పత్తుల కేంద్రంగా మారిన యూపీ

మొదటి పేజి తరువాయి

యూపీ డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా లక్నోలో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణుల గురించి అమిత్ షా ప్రత్యేకంగా ప్రస్తావించారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. అదేవిధంగా, అమేథీలో తయారవుతున్న ఏకే-203 అసాల్ట్ రైఫిళ్లు నక్సలైట్లు, ఉగ్రవాదులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు.కేంద్రం, రాష్ట్రంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల సమన్వయంతో, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో ఉత్తరప్రదేశ్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని అమిత్ షా ప్రశంసించారు. ఒకప్పుడు నేరాలు, వలసలకు నిలయంగా ఉన్న రాష్ట్రం, నేడు రక్షణ సామాగ్రి, వాహన శ్రేణి, వైద్య పరికరాల తయారీకి గమ్యస్థానంగా మారిందని కొనియాడారు. మెరుగైన శాంతిభద్రతల వల్లే రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని, 'ఒక జిల్లా-ఒక ఉత్పత్తి' పథకం అద్భుతమైన ఫలితాలను ఇస్తోందని వివరించారు.ప్రధాని మోదీ నాయకత్వంలో 12 ఏళ్ల క్రితం ప్రారంభించిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం నేడు సత్ఫలితాలను ఇస్తోందని షా తెలిపారు. ప్రస్తుతం భారత్ రక్షణ ఉత్పత్తుల విలువ రూ. 1 లక్ష కోట్లు దాటిందని, దాదాపు 80 దేశాలకు రక్షణ పరికరాలను ఎగుమతి చేస్తోందని, ఇందులో యూపీ పాత్ర కీలకమని అన్నారు. లక్నోలోని బ్రహ్మోస్ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీని 2025 మే నెలలో ప్రారంభించగా, తొలి బ్యాచ్ క్షిపణులను 2025 అక్టోబర్ లో విడుదల చేశారని ఆయన పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో నకిలీ వైద్యుడి అరెస్ట్..

మొదటి పేజి తరువాయి

కేవలం ఇంటర్ (2018-2020) మాత్రమే పూర్తి చేసిన ఇతను, తన తల్లి సబా ఖాన్ (అలియాస్ మహమ్మది బేగం), సోదరుడు మహ్మద్ ఫైజాన్‌తో కలిసి తమను తాము వంశపారంపర్య హకీంలుగా (సాంప్రదాయ వైద్యులు) పరిచయం చేసుకున్నారు. లైంగిక సమస్యలు, శ్వాసకోశ ఇబ్బందులు, ఛాతీ నొప్పి, కిడ్నీ సంబంధిత నొప్పులు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు వీరు చికిత్స అందిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. రోగులకు ప్రిస్క్రిప్షన్లు ఇవ్వడమే కాకుండా, ఎలాంటి లేబుల్స్ లేని, కేవలం మార్కర్‌తో కోడ్‌లు రాసిన మందులను ఇస్తూ ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారని పోలీసులు తెలిపారు.విచారణలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. అద్నాన్ 2023లో బీయూఎంఎస్ (యునానీ) పూర్తి చేసిన డాక్టర్ మునార్వా బేగంతో పరిచయం పెంచుకున్నాడు. ఆమెకు నెలకు రూ.13,000 చెల్లిస్తామని ఒప్పందం కుదుర్చుకుని, ఆమె పేరు మీద క్లినిక్‌ను నడపడం ప్రారంభించాడు. డాక్టర్ మునార్వా బేగం అప్పుడప్పుడు మాత్రమే క్లినిక్‌కు వచ్చి వెళ్తుండగా, అద్నాన్, అతని కుటుంబ సభ్యులే పూర్తిస్థాయిలో రోగులకు చికిత్స చేసేవారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, 'సాచ్ న్యూస్' వంటి మాధ్యమాల్లో తమ క్లినిక్‌కు విపరీతంగా ప్రచారం చేసుకుంటూ అమాయకులను ఆకర్షించేవారని పోలీసులు వివరించారు.క్లినిక్‌పై దాడి చేసిన పోలీసులు, పెద్ద మొత్తంలో లేబుల్స్ లేని మందుల పొట్లాలు, బాటిళ్లు, ప్రిస్క్రిప్షన్ పుస్తకాలు, ఫేస్‌బుక్ పేజీకి సంబంధించిన మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం అద్నాన్‌ను అరెస్ట్ చేయగా, అతని తల్లి సబా ఖాన్, సోదరుడు ఫైజాన్ పరారీలో ఉన్నారని పోలీసులు పేర్కొన్నారు. వారి కోసం గాలిస్తున్నామని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

మొదటి పేజి తరువాయి

కట్టుదిట్టంగా కదలిక..

ఖైరతాబాద్ గణనాథుని నిమజ్జనం(కోసం ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం రాత్రి నుంచే సన్నాహాలు మొదలు పెట్టారు. ముందుగా మండపం పైకప్పు (షెడ్డు), బ్యారికేడ్లను తొలగించి భారీ విగ్రహాన్ని సంప్రదాయం ప్రకారం కదిలించారు. శుక్రవారం తెల్లవారుజామున బాహుబలి క్రేన్ సహాయంతో మహా ప్రతిమను జాగ్రత్తగా 'టస్కర్' పైకి చేర్చారు. సాంకేతిక సరిచూపులు, వెల్డింగ్ పనుల అనంతరం ఉదయం పూజలు పూర్తి చేసి శోభాయాత్రను ప్రారంభించారు.

భక్తిపారవశ్యంలో ఎన్టీఆర్ మార్గ్

ఖైరతాబాద్‌లో ఉదయం 9.30 గంటలకు శోభాయాత్ర ప్రారంభమైంది. టెలిఫోన్ భవన్, తెలుగు తల్లి ఫ్లైఓవర్ మీదుగా ఎన్టీఆర్ మార్గ్(చీ= ఖీతీస్త్ర)కు చేరుకుంది. దారిపొడవునా వేలాదిమంది భక్తులు'గణపతి బప్పా మోరియా', 'బోలో గణేశ్ మహారాజ్ కి జై' అంటూ మహాగణపతికి నీరాజనాలు పలికారు. ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నంబర్ 4 వద్ద బడా గణేషుడి నిమజ్జనం చేపట్టారు. సుమారు 20 నిమిషాల పాటు సాగిన తుది



ప్రక్రియ అనంతరం మధ్యాహ్నం 2.15 గంటలకు శాస్త్రోక్తంగా సాగర్ జలాల్లోకి చేర్చారు.

ఈ మహాక్రతువును విజయవంతం చేయడానికి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్, పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు శోభాయాత్రలో నృత్యాలు చేస్తూ భక్తుల్లో ఉత్సాహం నింపారు. నిమజ్జన ఘట్టం తిలకించేందుకు హుస్సేన్ సాగర్ వద్దకు లక్షలాదిమంది భక్తులు తరలివచ్చారు. భావోద్వేగంతో స్వామివారికి వీడ్కోలు పలికారు.

అడుగడుగునా పోలీస్ నిఘా

హైదరాబాద్ సీపీ ఆధ్వర్యంలో వేలాది మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా పరిస్థితిని సమీక్షించారు. నిమజ్జనం ఉత్సవ బందోబస్తు కార్యక్రమంలో అశ్విక దళం అందర్నీ ఆకట్టుకుంది. జీహెచ్ఎంసీ, హెచ్ఎమ్డీఏ, విద్యుత్ శాఖ, జలమండలి మరియు డిజాస్టర్ రెస్పాన్స్ బృందాలు సమన్వయంతో పనిచేశాయి. హుస్సేన్‌సాగర్ నలువైపులా, ట్యాంక్ బండ్ ఫ్లైఓవర్లపై లక్షలాది మంది భక్తులు నిలబడి నిమజ్జన దృశ్యాలను వీక్షించగా, కొందరు బోట్లలో వెళ్లి సాగర్ లోపల నుండి ఈ ఘట్టాన్ని తిలకించారుఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన క్రేన్ నంబర్ 4 వద్దకు విగ్రహాన్ని చేర్చిన అనంతరం, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2.15 గంటలకు భారీ క్రేన్ల సహాయంతో విగ్రహాన్ని సాగరంలో నిమజ్జనం చేశారు. తమ ఆరాధ్య దైవమైన గణనాథుడికి భక్తులు అశ్రునయనాలతో ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జన ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది.

డీఎస్పీ భీమ్‌రెడ్డి ఆస్తుల కేసులో బినామీలపై ఏసీబీ దాడులు

మొదటి పేజి తరువాయి

హైదరాబాద్, జహీరాబాద్‌లలో సోదాలు

రూ.400 కోట్ల ఆస్తుల ఆధారాలు సేకరణ

మాజీ హోంగార్డు, ఆడిటర్ కార్యాలయాల్లో కీలక పత్రాల సీజ్

ఏసీబీ రాకతో విల్లా అమ్మిన వ్యక్తి పరారీ

పుప్పాలగూడలో ఉండే బిల్డర్ వీరబొమ్మ వెంకటేష్ ఇంట్లో జరిపిన సోదాల్లో అధికారులు రూ.1.35 కోట్ల నగదుతో పాటు విదేశీ కరెన్సీ, 14 విదేశీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. భీమ్‌రెడ్డి తరఫున నిర్మాణ రంగంలో వెంకటేష్ పెట్టుబడులు పెట్టినట్లు ఏసీబీ అనుమానిస్తోంది. గతంలో టోలిచౌకిలో బియ్యం వ్యాపారం చేసిన ఆయన.. భీమ్‌రెడ్డితో పరిచయం తర్వాత కోటీశ్వరుడిగా మారిన తీరుపై అధికారులు ఆరా తీస్తున్నారు.మరోవైపు, జహీరాబాద్‌లో భీమ్‌రెడ్డి ఆస్తులను చూసుకుంటున్న మాజీ హోంగార్డు లక్ష్మణ్ నాయక్ ఇల్లు, కార్యాలయంలో సోదాలు చేసి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. పటాన్‌చెరులో భీమ్‌రెడ్డి వద్ద హోంగార్డుగా పనిచేసిన లక్ష్మణ్, ఆ తర్వాత ఉద్యోగం మానేసి బంగారు నగల దుకాణం పెట్టి ధనవంతుడిగా మారినట్లు గుర్తించారు. భీమ్‌రెడ్డి ఆర్థిక వ్యవహారాలు చూసే ఆడిటర్ కార్యాలయంలోనూ డిజిటల్ ఆధారాలను సేకరించారు.ఈ కేసులో మరో కీలక వ్యక్తి, భీమ్‌రెడ్డికి ఇబ్రహీంబాగ్‌లో విల్లా అమ్మిన మాధవరావు.. ఏసీబీ అధికారులు వస్తున్నారని తెలిసి మార్నింగ్ వాక్ అని చెప్పి ఇంటి నుంచి వెళ్లి పరారయ్యారు. భీమ్‌రెడ్డి అరెస్ట్ తర్వాత పలువురు బినామీలు తమ ఫోన్లను ధ్వంసం చేసి సాక్ష్యాలను నాశనం చేసే ప్రయత్నం చేసినట్లు కూడా ఏసీబీ గుర్తించింది. ప్రస్తుతం కొందరి విచారణ మాత్రమే పూర్తికాగా, ఈ కేసులో మరికొంతమందిపై నిఘా పెట్టినట్లు సమాచారం.

శ్రీవారి దర్శనానికి భారీగా భక్తులు

మొదటి పేజి తరువాయి

నిన్న శ్రీవారిని దర్శించుకున్న 67,534 మంది భక్తులు

గురువారం హుండీ ఆదాయం రూ.3.40 కోట్లుగా వెల్లడి

గురువారం (సెప్టెంబర్ 24) నాడు శ్రీవారిని మొత్తం 67,534 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 25,411 మంది భక్తులు తలనీలాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. నిన్న ఒక్కరోజే స్వామివారి హుండీ ద్వారా రూ. 3.40 కోట్ల ఆదాయం లభించినట్లు టీటీడీ ప్రకటించింది.సాధారణ రోజుల్లో ఉండే రద్దీ కొనసాగుతుండటంతో, శ్రీవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తిరుమలకు చేరుకుంటున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అధికారులు ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

ఏపీలో మారిన పింఛన్ల పంపిణీ షెడ్యూల్

మొదటి పేజి తరువాయి

ఈ నెల చివరి వారంలో బ్యాంకులకు వరుస సెలవులు, సమ్మె ఉండటమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. సెప్టెంబర్ 26న బ్యాంకులకు సెలవు కాగా, 28, 29, 30 తేదీల్లో బ్యాంకు ఉద్యోగులు సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 1వ తేదీ ఉదయం స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు బ్యాంకులకు వెళ్లి పింఛన్లకు అవసరమైన నగదును విత్‌డ్రా చేస్తారు. అనంతరం మధ్యాహ్నం నుంచి లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ డబ్బులను పంపిణీ చేయనున్నారు.అక్టోబర్ నెలకు గాను రాష్ట్రవ్యాప్తంగా 61.80 లక్షల మంది పింఛన్ లబ్ధిదారుల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.2,692 కోట్లను విడుదల చేసింది. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు.ఇదిలా ఉంటే.. జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం (ఎన్ఎస్ఏపీ) కింద కేంద్రం ఇచ్చే నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పైలట్ ప్రాజెక్టును తొలుత విజయనగరం జిల్లా గజపతినగరం మండలంలో ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో మొత్తం 9.34 లక్షల మంది లబ్ధిదారులు ఈ పథకంతో అనుసంధానమై ఉన్నారు.

వంశధార, నాగావళికి పోటెత్తిన వరద..

మొదటి పేజి తరువాయి

నారాయణపురం ఆనకట్ట వద్ద కూడా మొదటి ప్రమాద హెచ్చరిక

నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

నదుల్లోకి ఈత, చేపల వేటకు వెళ్లొద్దని విపత్తుల సంస్థ హెచ్చరిక

వంశధార నదిపై ఉన్న గొట్టా బ్యారేజ్ వద్ద అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ప్రస్తుతం ఈ బ్యారేజ్‌లోకి 41,014 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, అంతే మొత్తంలో నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. మరోవైపు నాగావళి నదిలోనూ వరద ప్రవాహం కొనసాగుతోంది. తోటపల్లి బ్యారేజ్ వద్ద ఇన్-ఫ్లో, అవుట్-ఫ్లో 45,661 క్యూసెక్కులుగా నమోదవుతోంది.నాగావళి నదిపై ఉన్న నారాయణపురం ఆనకట్ట వద్ద ప్రవాహం 59,700 క్యూసెక్కులకు చేరడంతో అధికారులు అక్కడ కూడా మొదటి ప్రమాద హెచ్చరికను అమలులోకి తెచ్చారు. ఈ పరిస్థితులపై రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ స్పందిస్తూ.. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వరద తీవ్రత దృష్ట్యా నదుల్లోకి ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం వంటి పనులు అత్యంత ప్రమాదకరమని, అటువంటి వాటికి దూరంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.



హైదరాబాద్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం..

హైదరాబాద్ గచ్చిబౌలిలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు
ఆయన జయంతి సందర్భంగా శనివారం ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి
మన్మోహన్ సింగ్ దేశానికి, తెలంగాణకు చేసిన సేవలను స్మరించుకున్న మంత్రి పొన్నం
ఆయన నాయకత్వంలోనే ఉపాధి హామీ, ఆర్టీఐ వంటి చట్టాలు వచ్చాయని వెల్లడి
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మన్మోహన్ పాత్ర చారిత్రాత్మకమని కొనియాడిన ప్రభుత్వం



హైదరాబాద్,సెప్టెంబర్25సామాన్యుడి అస్త్రం

మాజీ ప్రధానమంత్రి, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. నగరంలోని ఐటీ కారిడార్ అయిన గచ్చిబౌలి విప్రో సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం (సెప్టెంబరు 26) ఆవిష్కరించనున్నారు.ఈ కార్యక్రమ ఏర్పాట్లను హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ విగ్రహం కేవలం ఒక స్మారక చిహ్నం కాదని, దేశ నిర్మాణంలో మన్మోహన్ సింగ్ పోషించిన పాత్ర, ఆయన ఆర్థిక దార్శనికత, నిస్వార్థ ప్రజాసేవ, నిరాడంబర నాయకత్వ లక్షణాలను భవిష్యత్ తరాలకు గుర్తుచేసే ఒక శాశ్వత ప్రతీక అని ఆయన అభివర్ణించారు.మన్మోహన్ సింగ్ పేరు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పొన్నం కొనియాడారు. 1991లో ఆర్థిక మంత్రిగా ఆయన ప్రారంభించిన సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులకు బాటలు వేశాయని గుర్తుచేశారు. 2004 నుంచి 2014 వరకు ప్రధానమంత్రిగా దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం, ఆర్థిక స్థిరత్వం కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన హయాంలోనే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం వంటివి అమల్లోకి వచ్చాయని తెలిపారు.తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. 2009లో ప్రక్రియ ప్రారంభించాలని నాటి యూపీఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం నుంచి 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్‌వ్యవస్థీకరణ చట్టం ద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు కేంద్రంలో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం చారిత్రాత్మక పాత్ర పోషించిందని ఆయన వివరించారు. రాష్ట్ర ఏర్పాటులో యూపీఏ ప్రభుత్వం, మన్మోహన్ సింగ్ పాత్రను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా గుర్తించిందని ఆయన తెలిపారు. ప్రధానిగా మన్మోహన్ సింగ్ మార్గదర్శకత్వంలో ఎంపీగా పనిచేయడం తన రాజకీయ జీవితంలో గర్వకారణమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

రేవంత్ రెడ్డికి 'బెస్ట్ పబ్లిక్ సర్వెంట్' అవార్డు



కేరళకు చెందిన ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ పురస్కారం
ప్రజా సంక్షేమ పాలనకు లభించిన జాతీయ గుర్తింపు
కేరళలోని నిలంబూర్‌లో నేడు అవార్డు ప్రదానోత్సవం
కార్యక్రమానికి హాజరయ్యేందుకు కేరళ వెళ్లిన సీఎం

హైదరాబాద్,సెప్టెంబర్25సామాన్యుడి అస్త్రం

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. కేరళకు చెందిన ప్రతిష్ఠాత్మక ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ అందజేస్తున్న 'ఆర్యదాన్ ముహమ్మద్ -- 2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్' అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. తెలంగాణలో ప్రజాస్వామ్య విలువల పట్ల నిబద్ధతతో పాటు రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం ఆయన అమలు చేస్తున్న వినూత్న పథకాలు, దూరదృష్టి గల నాయకత్వాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ ప్రకటించారు.ఈ అవార్డు ప్రదానోత్సవం కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు జరగనుంది. దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత ఆర్యదాన్ ముహమ్మద్ 4వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అవార్డును స్వీకరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే కేరళ చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సీ. వేణుగోపాల్ స్మారకోపన్యాసం చేయనున్నారు. రూ. లక్ష నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను రేవంత్ రెడ్డికి అందజేయనున్నారు.ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ మంత్రి ఏ.పి. అనిల్ కుమార్, ప్రముఖ మేధావి కల్‌పెట్ట నారాయణన్‌లతో కూడిన జ్యూరీ రేవంత్ రెడ్డిని ఈ అవార్డుకు ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. కేరళ రాజకీయాల్లో ఆర్యదాన్ ముహమ్మద్ సీనియర్ నేతగా, 8 సార్లు ఎమ్మెల్యేగా, నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేశారు. కార్మికులు, ప్రజా సంక్షేమం, లౌకికవాద విలువలకు ఆయన ప్రతీకగా నిలిచారు.

హైదరాబాద్‌కు రాపిడో ఫుడ్ డెలివరీ..
స్విగ్గీ, జొమాటోకు పోటీగా 'ఓన్లీ'

హైదరాబాద్‌లో 'ఓన్లీ' ఫుడ్ డెలివరీని ప్రారంభించిన రాపిడో
జీరో కమిషన్ మోడల్‌తో రెస్టారెంట్లకు పూర్తి ప్రయోజనం
కస్టమర్లకు ప్లాట్‌ఫామ్, సర్జ్ ఛార్జీల నుంచి మినహాయింపు
బెంగళూరులో విజయవంతం కావడంతో హైదరాబాద్‌లో విస్తరణ
రానున్న త్రైమాసికంలో ప్రధాన మెట్రో నగరాలకు విస్తరణ ప్రణాళిక

హైదరాబాద్,సెప్టెంబర్25సామాన్యుడి అస్త్రం

ప్రముఖ బైక్-ట్యాక్సీ సేవల సంస్థ రాపిడో, ఫుడ్ డెలివరీ రంగంలోకి తన వ్యాపార కార్యకలాపాలను విస్తరించింది. స్విగ్గీ, జొమాటో వంటి దిగ్గజ సంస్థలకు గట్టి పోటీనిచ్చే లక్ష్యంతో 'ఓన్లీ' (గ్రాఅశ్రీఎ) పేరుతో హైదరాబాద్?లో ఆహార పంపిణీ సేవలను ప్రారంభించింది. ఇప్పటివరకు బెంగళూరుకు పరిమితమైన ఈ సేవలు ఇప్పుడు నగరవాసులకు కూడా అందుబాటులోకి వచ్చాయి. వినియోగదారులు రాపిడో యాప్ ద్వారా లేదా ప్రత్యేకంగా రూపొందించిన 'ఓన్లీ' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఆహారాన్ని ఆర్డర్ చేయవచ్చు.'ఓన్లీ' అనుసరిస్తున్న వ్యాపార నమూనా ప్రస్తుత మార్కెట్‌లో ఉన్న ఇతర ఫుడ్ డెలివరీ యాప్‌లతో పోలిస్తే భిన్నంగా ఉంది. స్విగ్గీ, జొమాటోల మాదిరిగా ప్రతి ఆర్డర్‌పై రెస్టారెంట్ల నుంచి కమిషన్ వసూలు చేయకుండా, 'ఓన్లీ' పూర్తిస్థాయిలో జీరో-కమిషన్ విధానాన్ని అమలు చేస్తోంది. దీనికి బదులుగా భాగస్వామ్య రెస్టారెంట్ల నుంచి కేవలం నెలవారీ సబ్‌స్క్రిప్షన్ రుసుమును మాత్రమే వసూలు చేస్తుంది. దీనివల్ల ఆర్డర్ ద్వారా లభించే పూర్తి ఆదాయాన్ని రెస్టారెంట్లే ఉంచుకోవచ్చు. మరోవైపు కస్టమర్లకు కూడా మెనూ ధర, డెలివరీ ఛార్జీలు మినహా ప్యాకేజింగ్ ఫీజులు, ప్లాట్‌ఫామ్ ఫీజులు, సర్జ్ ఛార్జీలు వంటి అదనపు ఆర్థిక భారం ఉండదని కంపెనీ స్పష్టం చేసింది. ఈ పంపిణీ సేవల కోసం రాపిడో తన ప్రస్తుత 'కెప్టెన్' (రైడర్) నెట్‌వర్క్‌నే వినియోగించుకోనుంది.బెంగళూరులో ఇప్పటికే ఈ సేవలు విశేష ఆదరణ పొందాయి. ఇప్పటివరకు 22,000 రెస్టారెంట్లతో భాగస్వామ్యం కుదుర్చుకుని, 42 లక్షల ఆర్డర్లను పూర్తి చేసినట్లు 'ఓన్లీ' తెలిపింది.ఈ సందర్భంగా రాపిడో సహ-వ్యవస్థాపకుడు అరవింద్ శంకా మాట్లాడుతూ, బెంగళూరులో లభించిన విజయం తమకు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో బలమైన ఫుడ్ కల్చర్ ఉన్నందున ఇక్కడ కూడా తమ సేవలు విజయవంతం అవుతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రానున్న త్రైమాసికం (2026 అక్టోబర్) నుంచి దేశంలోని అన్ని ప్రధాన మెట్రో నగరాలకు 'ఓన్లీ' సేవలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు.

అట్టహాసంగా గణేష్ నిమజ్జన వేడుకలు.. అధికారులతో మంత్రి పొన్నం ఏరియల్ వ్యూ



హైదరాబాద్‌సామాన్యుడి అస్త్రం

: హైదరాబాద్ నగరంలో అట్టహాసంగా సాగుతున్న గణేష్ నిమజ్జన వేడుకలను హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఏరియల్ వ్యూ ద్వారా పర్యవేక్షించారు. నగరంలో ట్రాఫిక్, శోభాయాత్ర సాగుతున్న తీరును, హుస్సేన్‌సాగర్ పరిసరాల్లో జరుగుతున్న నిమజ్జన ప్రక్రియను మంత్రి హెలికాప్టర్ నుంచి నేరుగా పరిశీలించారు.ఈ విహంగ వీక్షణంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, డీజీపీ సీవీ ఆనంద్, పోలీస్ కమిషనర్ సజ్జనార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్-సికింద్రాబాద్ జంట నగరాల్లో నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పక్కా ఏర్పాట్లు చేశారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నామని వెల్లడించారు.



పుస్తకాలే జ్ఞాన మార్గం..

నిజామాబాద్‌సామాన్యుడి అస్త్రం


ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ నిజామాబాద్‌లో నూతన గ్రంథాలయ భవనాన్ని అభివృద్ధి చేయనున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. నిజామాబాద్ పట్టణంలో నిర్మించనున్న ఈ నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి ఆయన గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజారెడ్డితో పాటు పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. నేటి తరం విద్యార్థులు, యువత అవసరాలకు అనుగుణంగా గ్రంథాలయంలో ఆధునిక డిజిటల్ వనరులు, నాణ్యమైన పుస్తకాలు, అవసరమైన అన్ని సౌకర్యాలను అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు.

జ్ఞాన సమపార్జనకు పుస్తకాలే మార్గం:

పుస్తక పఠనం మానవ జీవితంలో అత్యంత కీలకమైనదని, అది ఆలోచనా పరిధిని పెంచడంతో పాటు ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుందని పేర్కొన్నారు. సాంకేతికత పెరిగి ప్రపంచం అరచేతిలోకి వచ్చిన తరుణంలో, సోషల్ మీడియాను కేవలం వినోదానికే పరిమితం చేయకుండా విద్య, విజ్ఞానం, నైపుణ్యాభివృద్ధికి ఆయుధంగా మలచుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. ప్రతి కళాశాల విద్యార్థి గ్రంథాలయ సభ్యత్వం తీసుకోవాలని, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. నిజామాబాద్ పట్టణ వాసులందరికీ ఈ నూతన భవనం ఒక సమగ్ర విజ్ఞాన కేంద్రంగా మారేలా అధికారులు, నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, గ్రంథాలయ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అధికార వర్గాలను నిలదీసిన రష్మి గౌతమ్..



జంతు సంక్షేమంపై అధికారులను ప్రశ్నిస్తూ పోస్ట్ పెట్టిన రష్మి గౌతమ్

జంతువుల కోసం కేటాయించిన నిధులు ఎక్కడికి పోతున్నాయని నిలదీత

ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రులు, షెల్టర్ల దుస్థితిపై తీవ్ర ఆవేదన

ఆన్‌లైన్‌లో వాదించకుండా ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని ప్రజలకు పిలుపు

తనపై వచ్చే విమర్శలను పట్టించుకోనని స్పష్టం చేసిన రష్మి

హైదరాబాద్,సెప్టెంబర్25సామాన్యుడి అస్త్రం

ప్రముఖ యాంకర్, నటి రష్మి గౌతమ్ మరోసారి తన జంతుప్రేమను చాటుకున్నారు. మూగజీవాల సంక్షేమం విషయంలో ప్రభుత్వాలు, అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జంతు సంక్షేమం కోసం కేటాయించిన నిధులు ఎక్కడికి పోతున్నాయంటూ సోషల్ మీడియా వేదికగా సూటి ప్రశ్నలు సంధించారు. తనను వ్యక్తిగతంగా దూషించినా, విమర్శించినా తాను పట్టించుకోనని, కానీ అసలు సమస్యను మాత్రం ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు.ఈ మేరకు రష్మి పెట్టిన సోషల్ మీడియా పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. “నన్ను తిట్టండి, అవమానించండి, సిగ్గుపడేలా మాట్లాడండి.. నేను అస్సలు పట్టించుకోను. కానీ, మీరు అధికారులను ప్రశ్నించడం ఎప్పుడు మొదలుపెడతారు? అసలు ప్రశ్న ఒక్కటే.. ఆ డబ్బు ఎక్కడికి పోతోంది?” అంటూ ఆమె తన పోస్ట్‌ను ప్రారంభించారు.దేశంలో జంతు సంరక్షణ శాలలు (యానిమల్ షెల్టర్లు) ఎందుకు అంత దారుణమైన పరిస్థితుల్లో ఉన్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పశువైద్యశాలల్లో సరైన పరికరాలు, సౌకర్యాలు ఎందుకు లేవని ప్రశ్నించారు. వీధి కుక్కలు, పిల్లులకు వ్యాక్సినేషన్, సంతాన నియంత్రణ ఆపరేషన్లు ఎందుకు జరగడం లేదని నిలదీశారు. అలాగే, ఆవులు, గేదెల యజమానులకు సరైన మార్గదర్శకాలు ఎందుకు ఇవ్వడం లేదని, వన్యప్రాణులు జనావాసాల్లోకి ఎందుకు వస్తున్నాయని ఆమె వరుస ప్రశ్నలు సంధించారు.”ఇలాగే కొనసాగితే భవిష్యత్ తరాలకు పచ్చదనం అనేది మిగులుతుందా? నా పేజీలో కీబోర్డ్ వారియర్‌లా పోరాడితే మీకు ఎలాంటి ప్రయోజనం ఉండదు, కనీసం నా దృష్టిని కూడా ఆకర్షించలేరు. మీ సమయాన్ని, శక్తిని సరైన మార్గంలో ఉపయోగించి వ్యవస్థను ప్రశ్నించండి” అని రష్మి హితవు పలికారు. కేవలం ఆన్‌లైన్‌లో వాదించుకోవడం మానేసి, మార్పు కోసం అధికారులను నిలదీయాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. జంతు సంక్షేమం, పర్యావరణ పరిరక్షణపై రష్మి చేసిన ఈ వ్యాఖ్యలకు నెటిజన్ల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది.

సాహితీ ఇన్‌ఫ్రా కేసులో అరికెపూడి గాంధీకి ఈడీ సమన్లు



రూ. 2.1 కోట్ల నగదు లావాదేవీలపై ఈడీ నోటీసులు

ఈ నెల 27న విచారణకు హాజరు కావాలన్న ఈడీ అధికారులు

పోలీసుల ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు

హైదరాబాద్,సెప్టెంబర్25సామాన్యుడి అస్త్రం

సాహితీ ఇన్‌ఫ్రా మనీలాండరింగ్ దర్యాప్తులో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. రూ.2.1 కోట్ల నగదు లావాదేవీలపై వివరణ తీసుకునేందుకు ఈ నెల 27న విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో ఈడీ అధికారులు పేర్కొన్నారు. సాహితీ ఇన్‌ఫ్రా ఖాతాల నుంచి గాంధీకి సుమారు రూ.2.1 కోట్ల మేర బదిలీ అయినట్లు అధికారులు గుర్తించినట్టు సమాచారం.తెలంగాణ పోలీసుల ఎఫ్ఐఆర్‌ను ఆధారంగా చేసుకుని మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. సంస్థపై ప్రీ-లాంచ్ ఆఫర్ల పేరుతో కొనుగోలుదారుల నుంచి నిధులు సేకరించి, వాటిని దారి మళ్లించారనే ఆరోపణలపై ఇప్పటికే విచారణ జరుగుతోంది. ఈ కేసులో సంస్థకు, సంబంధిత వ్యక్తులకు చెందిన ఆస్తులపై గతంలో ఈడీ చర్యలు తీసుకుంది. రూ.161 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేశారు. సాహితీ ఇన్‌ఫ్రాటెక్ ఎండీ బూడాటి లక్ష్మీనారాయణను 2024లో అరెస్ట్ చేశారు.

తెలంగాణలో 15 లక్షల కొత్త రేషన్ కార్డులు : మంత్రి సీతక్క

జయశంకర్ భూపాలపల్లిసామాన్యుడి అస్త్రం



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పంచాయతి రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు.భూపాలపల్లి మండలం,పెద్దాపూర్ రైతు వేదికలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 15 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు.రేషన్ కార్డు కేవలం బియ్యం పొందేందుకు మాత్రమే కాకుండా ఆరోగ్యశ్రీ సేవలు, ఆదాయ ధ్రువీకరణ తదితర అవసరాలకు కీలకమైన అధికారిక పత్రంగా ఉపయోగపడుతుందని,మహిళకు గౌరవం,స్వేచ్ఛతో పాటు ఆర్థిక స్వావలంబన కల్పించాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు ఇందిరమ్మ ఇళ్లు,రేషన్ కార్డులను మహిళల పేరిటే మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రతా పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, రానున్న 10 నుంచి 15 రోజుల్లో కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు.మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు స్వయం ఉపాధి పొందేందుకు, వ్యాపారాలు ప్రారంభించేందుకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంఘాల ద్వారా రూ.లక్ష వరకు రుణం అందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వివిజి రాంజీ పథకం కింద గ్రామాల్లో సుమారు 370 రకాల పనులు చేపట్టేందుకు అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీకి సగటున రూ.50 లక్షల వరకు నిధులు వచ్చే అవకాశం ఉన్నందున మేకల షెడ్లు, కోళ్ల ఫారాలు, ఫామ్ పాండ్లు, డ్రైనేజీలు, కాలువలు తదితర పనులను చేపట్టి గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడంతో పాటు వీవో భవనాలు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో గుడిసెలు, తాత్కాలిక నివాసాల్లో ఉన్న పేదలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు. లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోవాలనుకునే సొంత స్థలంలో నిలబడి ఫొటోలు ఇవ్వాలని సూచించారు. దీనివల్ల క్షేత్రస్థాయి పరిశీలన సులభతరం అవుతుందని పేర్కొన్నారు.జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా, సురక్షితంగా నిత్యావసర సరుకులు అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఆగస్టు 15 నుంచి జిల్లా వ్యాప్తంగా పంపిణీ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,39,530 స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా 3,95,962 మంది లబ్ధి పొందుతున్నట్లు తెలిపారు. భూపాలపల్లి మండల పరిధిలోని పెద్దాపూర్, బావుసింగ్‌పల్లి,మూలపల్లి, లంబాడితండ, సుబ్బక్కపల్లి గ్రామాల్లో మొత్తం 1,993 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.నకిలీ, డూప్లికేట్ కార్డులకు తావులేకుండా హోలోగ్రామ్, ఇష్యూయింగ్ అథారిటీ ముద్ర, హిడెన్ ఇమేజ్ తదితర తొమ్మిది రకాల భద్రతా ఫీచర్లను ప్రభుత్వం కార్డుల్లో పొందుపరిచినట్లు కలెక్టర్ తెలిపారు.స్మార్ట్ రేషన్ కార్డులను టి-రేషన్ మొబైల్ యాప్‌తో అనుసంధానం చేసినట్లు స్పష్టంచేశారు. దీని ద్వారా ప్రజలు తమ రేషన్ కార్డు వివరాలను డిజిటల్‌గా వినియోగించుకోవచ్చన్నారు.స్మార్ట్ రేషన్ కార్డుల విధానంతో రేషన్ పంపిణీలో లీకేజీలను అరికట్టి, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి రావాల్సిన కోటా సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, తహసీల్దార్ లక్ష్మి రాజయ్య, ఎంపిడిఓ తరుణ్ ప్రసాద్, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బడా గణేశ్ శోభాయాత్ర: పోలీసులతో కలిసి స్టెప్పులేసిన దానం నాగేందర్



ఖైరతాబాద్ గణేశ్ శోభాయాత్రలో డ్యాన్స్ చేసిన దానం నాగేందర్

మహిళా కానిస్టేబుళ్లతో కలిసి స్టెప్పులేసిన వైనం

‘ప్యారడైజ్’ సినిమా పాటకు డ్యాన్స్ చేసి ఉత్సాహం పంచారు

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో

బడా గణేశ్ నిమజ్జన వేడుకల్లో చోటుచేసుకున్న ఘటన

హైదరాబాద్,సెప్టెంబర్25సామాన్యుడి అస్త్రం

హైదరాబాద్‌లోని ప్రఖ్యాత ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన శోభాయాత్ర వైభవంగా సాగుతోంది. ఈ వేడుకల్లో భాగంగా దానం నాగేందర్ ఉత్సాహంగా నృత్యం చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.శుక్రవారం వైభవంగా సాగుతున్న శోభాయాత్రలో ఈ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. బందోబస్తు విధుల్లో ఉన్న కొందరు మహిళా కానిస్టేబుళ్లతో కలిసి దానం నాగేందర్ నృత్యం చేశారు. ఇటీవల విడుదలైన ‘ప్యారడైజ్’ చిత్రంలోని ఒక పాటకు ఆయన ఉత్సాహంగా స్టెప్పులు వేసి వేడుకల్లో జోష్ నింపారు. పండుగ వాతావరణంలో ఆయన చేసిన ఈ నృత్యం అక్కడ ఉన్న భక్తులను, చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దానం నాగేందర్ నృత్యంపై నెటిజన్లు విభిన్న రీతుల్లో స్పందిస్తున్నారు. కొందరు ఆయనలోని ఉత్సాహాన్ని ప్రశంసిస్తుండగా, మరికొందరు ఈ అంశంపై రాజకీయ కోణంలో వ్యాఖ్యలు చేస్తున్నారు.

ఓట్ల తొలగింపుపై బీజేపీ కుట్ర.. మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు

అర్హులైన ఓటర్లకూ నోటీసులిస్తున్నారని విమర్శ

గతంలో పలుమార్లు ఓటు వేసిన వారినీ ఇబ్బంది పెడుతున్నారని ఆరోపణ

సీఈసీ పదవి నుంచి జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాలని డిమాండ్

అర్హులందరికీ ఓటు హక్కు ఉండాలన్న మహేశ్ గౌడ్

హైదరాబాద్,సెప్టెంబర్25సామాన్యుడి అస్త్రం

అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. పౌరులకు నోటీసులు ఇచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ డిమాండ్ చేసినట్టుగా ఎన్నికల సంఘం ప్రధాన అధికారి వెంటనే పదవి నుంచి తప్పుకోవాలని అన్నారు. లేకపోతే వారిని ప్రభుత్వం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.ఈ దేశంలో పుట్టిన పౌరులకు, గతంలో పలుమార్లు ఓటు వేసిన వారికి కూడా నోటీసులు ఇస్తూ ఇబ్బంది పెడుతున్నారని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడాలని అన్నారు.నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జనం అతిపెద్ద పండుగల్లో ఒకటని మహేశ్ కుమార్ చెప్పారు. గణనాథుడిని సాగనంపుతూ రాష్ట్రం వ్యవసాయం, ఆరోగ్యం, విద్య సహా అన్ని రంగాల్లో ముందుకు సాగాలని కోరుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిగా అందాలని ఆకాంక్షించారు. మరోసారి ప్రజల ఆశీర్వాదం కాంగ్రెస్‌కు ఉండాలని కోరుకున్నామని చెప్పారు.



వికసిత్ భారత్ నిర్మాణంలో
ఏపీని గ్రోత్ ఇంజన్‌గా నిలుపుతాం

అహ్మదాబాద్‌లో గుజరాత్ పారిశ్రామికవేత్తలతో మంత్రి సమావేశం
ఏపీలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడి
ప్రభుత్వ పనితీరు బుల్లెట్ ట్రైన్ వేగంతో ఉంటుందని పెట్టుబడిదారులకు హామీ
గుజరాత్, ఏపీ కలిసి పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చని వ్యాఖ్య



అమరావతి,సెప్టెంబర్25,సామాన్యుడి అస్త్రం

2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ ప్రధాన గ్రోత్ ఇంజన్‌గా నిలవాలని, ఈ అభివృద్ధి ప్రయాణంలో పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. అహ్మదాబాద్‌లో సీఐఐ (కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) ఆధ్వర్యంలో జరిగిన పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ రోడ్‌షోలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గుజరాత్ పారిశ్రామిక స్ఫూర్తి దేశానికి ఆదర్శమని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆ రాష్ట్రం సాధించిన ప్రగతి అద్భుతమని కొనియాడారు. వైబ్రంట్ గుజరాత్ మోడల్ స్ఫూర్తితో ఏపీ కూడా శరవేగంగా దూసుకెళ్తోందని, ఈ ప్రగతిలో గుజరాత్ పారిశ్రామిక రంగం భాగస్వామి కావాలని ఆయన కోరారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో, వేగవంతమైన నిర్ణయాలతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని లోకేశ్ తెలిపారు. తమ ప్రభుత్వ పనితీరుకు ఫలితాలే నిదర్శనమని, 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీకే వచ్చాయని గుర్తుచేశారు. ఏపీలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, మాటలకే పరిమితం కాకుండా చేతల్లో వేగం చూపిస్తున్నామని వివరించారు. గుజరాత్‌లో డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటే, ఏపీలో కేంద్రం సహకారంతో 'నాయుడు-మోదీజీ' జోడీతో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉందని వ్యాఖ్యానించారు.ప్రభుత్వ వేగానికి ఉదాహరణగా గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్టులను లోకేశ్ ప్రస్తావించారు. విశాఖలో గూగుల్ ఏఐ హబ్, డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను కేవలం 13 నెలల్లో పూర్తి చేశామని తెలిపారు. అదేవిధంగా, సుమారు 12 బిలియన్ డాలర్ల పెట్టుబడితో రానున్న ఆర్సెలర్ మిట్టల్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్‌కు సంబంధించిన భూసేకరణ, పర్యావరణ అనుమతులు, పునరావాసం వంటి క్లిష్టమైన ప్రక్రియలను కేవలం 17 నెలల్లో పూర్తి చేశామని వివరించారు. పెట్టుబడిదారుల సమస్యలను వ్యక్తిగత సమస్యగా కాకుండా, వ్యవస్థాగత సమస్యగా చూసి శాశ్వత పరిష్కారాలు చూపుతామని భరోసా ఇచ్చారు. అందుకే కొందరు తనను సరదాగా 'ఆంధ్రా డోలో-650' అని పిలుస్తారని అన్నారు.పెట్టుబడిదారులను కేవలం అనుమతుల కోసం వచ్చేవారిగా కాకుండా రాష్ట్ర అభివృద్ధిలో దీర్ఘకాలిక భాగస్వాములుగా చూస్తామని లోకేశ్ స్పష్టం చేశారు. 'స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్' అనే మూడు సూత్రాలతో ముందుకెళ్తున్నామన్నారు. రాష్ట్రంలో క్లస్టర్ ఆధారిత అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా వంటి 23 రంగాల్లో ప్రత్యేక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. విశాఖ, అమరావతి, తిరుపతిలను ప్రత్యేక ఆర్థిక రీజియన్లుగా తీర్చిదిద్దుతామని, హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన అనుభవంతో అమరావతిని కూడా ఉన్నతంగా నిర్మిస్తామని చంద్రబాబు పట్టుదలతో ఉన్నారని అన్నారు.గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పోటీపడాల్సిన అవసరం లేదని, కలిసి పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చని అభిప్రాయపడ్డారు. ఏపీని తూర్పు భారతదేశానికి వ్యూహాత్మక గేట్‌వేగా వినియోగించుకోవాలని గుజరాత్ పారిశ్రామికవేత్తలను కోరారు. నవంబర్‌లో జరగనున్న పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆహ్వానిస్తూ, 2047 నాటికి ఏపీ ఆర్థిక వ్యవస్థను 2.4 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సీఐఐ గుజరాత్ ప్రతినిధులు, ఏపీఐఐసీ ఉన్నతాధికారులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

పవన్ సమక్షంలో జనసేనలో
చేరిన యనమల కృష్ణుడు, నవీన్ నిశ్చల్



జనసేన పార్టీలో చేరిన పలువురు వైసీపీ నేతలు
పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న నేతలు
పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలకు పవన్ సూచన
పవన్ పాలన, నిబద్ధతకు ఆకర్షితులై చేరామన్న నేతలు

అమరావతి,సెప్టెంబర్25,సామాన్యుడి అస్త్రం

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేన పార్టీలోకి చేరికల పర్వం కొనసాగుతోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ బలోపేతంపై దృష్టి సారించిన జనసేన, తాజాగా వైసీపీకి గట్టి షాక్ ఇచ్చింది. పలు నియోజకవర్గాలకు చెందిన కీలక వైసీపీ నేతలతో పాటు, కాంగ్రెస్ నాయకురాలు ఒకరు శుక్రవారం జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరారు.తుని నియోజకవర్గానికి చెందిన వైసీపీ నేత యనమల కృష్ణుడు, హిందూపురం సీనియర్ నాయకుడు నవీన్ నిశ్చల్ వంటి ప్రముఖులు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ పరిపాలనలో చూపుతున్న నిబద్ధత, చేపడుతున్న సంస్కరణలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు ఈ సందర్భంగా నేతలు తెలిపారు.వీరితో పాటు ఏలూరు డీసీసీబీ మాజీ ఛైర్మన్ పీవీఎల్ఎన్ నరసింహరాజు, కందుకూరు, సర్వేపల్లి, కనిగిరి నియోజకవర్గాల వైసీపీ పరిశీలకుడు మన్నెమాల సుకుమార్ రెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు అయితాబత్తుల సుభాషిణి కూడా జనసేనలో చేరారు. తునికి చెందిన పొలినాటి శేషగిరిరావు, తణుకు నుంచి దిరిశాల కృష్ణ శ్రీనివాస్, శ్రీకాళహస్తికి చెందిన సత్రవాడ ప్రవీణ్, మిద్దెల హరి, ముమ్మడివరం మాజీ ఏఎంసీ ఛైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, నరసరావుపేటకు చెందిన ఏలూరి ప్రసాద్ తదితరులు పవన్ కల్యాణ్ చేతుల మీదుగా పార్టీ కండువా కప్పుకున్నారు.ఈ సందర్భంగా కొత్తగా చేరిన నాయకులను ఉద్దేశించి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. అందరినీ కలుపుకొని, సమష్టిగా పనిచేస్తూ పార్టీ ఉన్నతికి కృషి చేయాలని వారికి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జనసేనలో చేరికలు ఊపందుకోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఏపీ హోంగార్డులకు శుభవార్త.. కానిస్టేబుల్ ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్

ఏపీలోని హోంగార్డులకు ప్రభుత్వం శుభవార్త
కానిస్టేబుల్ డ్రైవర్ పోస్టుల నియామకాల్లో 10 శాతం రిజర్వేషన్
ప్రభుత్వ పాత ఉత్తర్వులను సవరిస్తూ కొత్త జీవో జారీ
పోలీస్ రవాణా విభాగంలో 198 పోస్టుల భర్తీకి రంగం సిద్ధం

అమరావతి,సెప్టెంబర్25,సామాన్యుడి అస్త్రం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని హోంగార్డులకు ప్రభుత్వం శుభవార్త వినిపించింది. పోలీస్ శాఖలో స్టిపెండరీ కానిస్టేబుల్ (డ్రైవర్) పోస్టుల నియామకాల్లో వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గతంలో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులను (జీవో) సవరిస్తూ నూతన ఆదేశాలను జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయం సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న హోంగార్డులకు పెద్ద ఊరటనిచ్చింది.పోలీస్ రవాణా సంస్థ (ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్) పరిధిలో 198 స్టైపెండరీ కానిస్టేబుల్ (డ్రైవర్) పోస్టుల భర్తీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెలలోనే విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ నియామక ప్రక్రియ నుంచే హోంగార్డులకు కేటాయించిన 10 శాతం రిజర్వేషన్ అమలులోకి రానుంది.నూతన రిజర్వేషన్ విధానం ద్వారా శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరాలనుకుంటున్న అర్హులైన హోంగార్డులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల హోంగార్డుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం: పెమ్మసాని



విజయవాడలో తొలిసారి నేషనల్ సరస్ ప్రదర్శన ఏర్పాట్లను పరిశీలించిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
మహిళా సంఘాల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని వ్యాఖ్య

అమరావతి,సెప్టెంబర్25సామాన్యుడి అస్త్రం

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం, వారి ఆర్థిక సాధికారతను పెంపొందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. విజయవాడలో తొలిసారిగా నిర్వహిస్తున్న 'నేషనల్ సరస్ ప్రదర్శన' ఏర్పాట్లను రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఉన్నతాధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన మార్కెట్ సౌకర్యాన్ని కల్పించడమే ధ్యేయంగా నేషనల్ సరస్ మేళాను ఢిల్లీ నుంచి విజయవాడకు తీసుకువచ్చామని తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే మహిళా పారిశ్రామికవేత్తల కోసం 350కి పైగా స్టాళ్లను సిద్ధం చేస్తున్నామని, ఇందులో ఒక్క ఆంధ్రప్రదేశ్ నుంచే సుమారు 250 స్టాళ్లు ఉండబోతున్నాయని చెప్పారు. ఇతర రాష్ట్రాల విజయగాథలు, అనుభవాలను పంచుకునేలా ఈ మేళాను ఒక ప్రత్యేక 'లెర్నింగ్ సెంటర్'గా మలుస్తున్నామని పేర్కొన్నారు.అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు తయారు చేసే నాణ్యమైన ఉత్పత్తులకు గుర్తింపు కల్పించేందుకు 'స్వయం ఏపీ' అనే ప్రతిష్ఠాత్మక బ్రాండ్‌ను ప్రతిపాదించినట్లు వెల్లడించారు. దీని ద్వారా బ్రాండింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ అంశాల్లో మహిళలకు అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు. దసరా ఉత్సవాల వేళ విజయవాడకు ఈ ఈవెంట్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని, సందర్శకుల సౌకర్యాలు, భద్రత మరియు పార్కింగ్ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులతో విస్తృత సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు.

నవంబర్ 1 నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు..




విజయవాడలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వర్క్‌షాప్
రాష్ట్ర వ్యాప్తంగా 2,619 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్న నాదెండ్ల
ధాన్యం తరలించేందుకు 31 వేల వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్టు వెల్లడి

అమరావతి,సెప్టెంబర్25,సామాన్యుడి అస్త్రం

ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ ధాన్యం సేకరణ కార్యక్రమాన్ని నవంబర్ 1న ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలో పౌరసరఫరాల శాఖ నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడిన ఆయన, రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు, రవాణా, మిల్లింగ్ ప్రక్రియకు సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.రాష్ట్ర వ్యాప్తంగా 2,619 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. సేకరణ ప్రక్రియ కోసం 24 వేల మంది సిబ్బందిని నియమించగా, కల్లాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించేందుకు 31 వేల వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్టు వెల్లడించారు. ఈసారి రైతులకు రవాణా ఖర్చులు కూడా చెల్లించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు.ఎల్‌నినో ప్రభావం కారణంగా పంట దిగుబడులు, తద్వారా ధాన్యం సేకరణ అంచనాలు తగ్గినట్లు నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. అయినప్పటికీ, రైతుల వద్ద ధాన్యం నిల్వ ఉండకుండా సకాలంలో కొనుగోలు చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రవాణా, గోనె సంచుల సరఫరా, మిల్లుల సామర్థ్యం, చెల్లింపుల ప్రక్రియ వంటి అంశాల్లో పౌరసరఫరాల శాఖతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలను భాగస్వామ్యం చేసేందుకే ఈ వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన తర్వాత చెల్లింపులు ఆలస్యం కాకుండా ముందస్తు కార్యాచరణ అమలు చేయాలని చెప్పారు.

యూపీ తయారీ బ్రహ్మోస్ క్షిపణులతో పాకిస్థాన్‌కు కంటి మీద కునుకు లేదు: అమిత్ షా

అమేథీ ఏకే-203 రైఫిళ్లు నక్సలైట్లను వణికిస్తున్నాయన్న అమిత్ షా
నేరాల అడ్డా నుంచి రక్షణ ఉత్పత్తుల కేంద్రంగా మారిన యూపీ
భారత్ రక్షణ ఉత్పత్తుల విలువ రూ.లక్ష కోట్లు దాటింది
దాదాపు 80 దేశాలకు రక్షణ పరికరాలు ఎగుమతి చేస్తున్న భారత్



న్యూఢిల్లీ,సెప్టెంబర్25,సామాన్యుడి అస్త్రం

ఉత్తరప్రదేశ్‌లో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులను మిగులుస్తున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. దేశ రక్షణ ఉత్పత్తుల తయారీలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కీలక కేంద్రంగా ఎదుగుతోందని ఆయన పేర్కొన్నారు. గ్రేటర్ నోయిడాలో శుక్రవారం జరిగిన 'ఉత్తరప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన' (యూపీఐటీఎస్)ను ప్రారంభించిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.యూపీ డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా లక్నోలో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణుల గురించి అమిత్ షా ప్రత్యేకంగా ప్రస్తావించారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. అదేవిధంగా, అమేథీలో తయారవుతున్న ఏకే-203 అసాల్ట్ రైఫిళ్లు నక్సలైట్లు, ఉగ్రవాదులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు.కేంద్రం, రాష్ట్రంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల సమన్వయంతో, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో ఉత్తరప్రదేశ్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని అమిత్ షా ప్రశంసించారు. ఒకప్పుడు నేరాలు, వలసలకు నిలయంగా ఉన్న రాష్ట్రం, నేడు రక్షణ సామాగ్రి, వాహన శ్రేణి, వైద్య పరికరాల తయారీకి గమ్యస్థానంగా మారిందని కొనియాడారు. మెరుగైన శాంతిభద్రతల వల్లే రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని, 'ఒక జిల్లా-ఒక ఉత్పత్తి' పథకం అద్భుతమైన ఫలితాలను ఇస్తోందని వివరించారు.ప్రధాని మోదీ నాయకత్వంలో 12 ఏళ్ల క్రితం ప్రారంభించిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం నేడు సత్ఫలితాలను ఇస్తోందని షా తెలిపారు. ప్రస్తుతం భారత్ రక్షణ ఉత్పత్తుల విలువ రూ. 1 లక్ష కోట్లు దాటిందని, దాదాపు 80 దేశాలకు రక్షణ పరికరాలను ఎగుమతి చేస్తోందని, ఇందులో యూపీ పాత్ర కీలకమని అన్నారు. లక్నోలోని బ్రహ్మోస్ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీని 2025 మే నెలలో ప్రారంభించగా, తొలి బ్యాచ్ క్షిపణులను 2025 అక్టోబర్ లో విడుదల చేశారని ఆయన పేర్కొన్నారు.

దీన్‌దయాళ్ ఆలోచనలే వికసిత్ భారత్‌కు దిక్సూచి: ప్రధాని మోదీ



దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా మోదీ నివాళి
వ్యక్తి ప్రగతి సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంతమని వెల్లడి
అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలనేదే అంత్యోదయ లక్ష్యమని వ్యాఖ్య

న్యూఢిల్లీ,సెప్టెంబర్25,సామాన్యుడి అస్త్రం

స్వదేశీ భావజాలంతో దేశాభివృద్ధికి ప్రత్యేక దృక్పథాన్ని అందించిన మహనీయుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని ప్రధాని మోదీ కొనియాడారు. ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ స్ఫూర్తే బీజేపీకి, తమ ప్రభుత్వాల నిర్ణయాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. వ్యక్తి ప్రగతి సమాజం నుంచి వేరుగా కాకుండా, సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంత సారమని చెప్పారు. ప్రకృతిని దెబ్బతీయకుండా సమాజం పురోగమించేలా అభివృద్ధి నమూనా ఉండాలని ఆయన ఆలోచనలు చెబుతాయని వివరించారు. దీన్ దయాళ్ జయంతి సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తి వరకు చేరడమే అంత్యోదయ లక్ష్యమని మోదీ గుర్తుచేశారు. ఏకాత్మ మానవతావాదాన్ని వివరిస్తూ, వ్యక్తి ఎదుగుదలతో పాటు సమాజం, ప్రకృతి, దేశం మధ్య సమతుల్యత ఉండాలని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించారని ప్రధాని పేర్కొన్నారు. కేవలం ఆర్థిక వృద్ధే అభివృద్ధి కాదని, అందులో సామాజిక సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ కూడా భాగస్వామ్యం కావాలని ఆయన భావించినట్లు తెలిపారు.పేదల సంక్షేమం, సమాజంలోని అట్టడుగు వర్గాల సాధికారత, పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యమిస్తూ తమ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని మోదీ వివరించారు. ఈ ఆలోచనల స్ఫూర్తితోనే సమగ్ర, అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యంగా 'వికసిత్ భారత్' నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు.

యూపీఐ లావాదేవీలపై చార్జీలు.. వినియోగదారులకు భారం లేదన్న నిర్మలా సీతారామన్

ఎండీఆర్ చార్జీలపై వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న నిర్మల
ఈ చార్జీలు కేవలం వ్యాపారులకు మాత్రమే పరిమితమని స్పష్టీకరణ
నిబంధనలపై అవగాహన లోపం వల్లే అపోహలు వ్యాపిస్తున్నాయని వ్యాఖ్య



న్యూఢిల్లీ,సెప్టెంబర్25,సామాన్యుడి అస్త్రం

యూపీఐ డిజిటల్ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) చార్జీలు విధించనున్నారనే ప్రచారంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టత ఇచ్చారు. ఈ అంశంతో సాధారణ ఖాతాదారులు లేదా వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి జేబుపై ఎలాంటి అదనపు భారం పడదని తెలిపారు. రూ.2,000కు మించిన కొన్ని నిర్దిష్ట డిజిటల్ లావాదేవీలకు ఎండీఆర్ వర్తించినా, అది వినియోగదారులకు కాదని, వ్యాపారులకే పరిమితమని మంత్రి చెప్పారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ మేరకు స్పష్టతనిచ్చారు.ఎండీఆర్ అనేది కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే పన్ను, సెస్ లేదా సర్‌చార్జ్ కాదని... ఆ మొత్తం ప్రభుత్వ ఖజానాకు వెళ్లదని స్పష్టం చేశారు. బ్యాంకులు, పేమెంట్ గేట్‌వేలు వంటి డిజిటల్ చెల్లింపు వ్యవస్థ నిర్వహణకు సంబంధించిన ఖర్చుల కోసం ఈ రుసుము ఉంటుందని వివరించారు. ఎండీఆర్ నిబంధనలపై అవగాహన లోపం వల్లే అనవసర అపోహలు వ్యాపిస్తున్నాయని అన్నారు. ఇప్పటికే డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా జరిగే చెల్లింపుల్లో వ్యాపారులు ఇలాంటి రుసుములను భరిస్తున్నారని గుర్తుచేశారు. యూపీఐ చెల్లింపుల విషయంలోనూ ఈ చార్జీని కస్టమర్లపైకి నెట్టే అవకాశం ఉండదని మంత్రి తేల్చిచెప్పారు. డిజిటల్ చెల్లింపులను ఉపయోగించే ప్రజలకు సేవలు ఉచితంగానే, ఎప్పటిలాగే అంతరాయం లేకుండా అందుబాటులో ఉంటాయని తెలిపారు. తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజలు గందరగోళానికి గురికావొద్దని సూచించిన ఆమె, ఎండీఆర్ ద్వారా వసూలయ్యే సొమ్ము డిజిటల్ పేమెంట్ నెట్‌వర్క్ నిర్వహణలో భాగస్వామ్యమైన బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థల వ్యవస్థాపక వ్యయాలకే ఉపయోగపడుతుందని వివరించారు.

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఆర్బీఐ కొత్త నిబంధనలు.



బల్క్ డిపాజిట్లపై ఆర్బీఐ కీలక మార్పులు
రూ.3 కోట్లు, ఆపైన డిపాజిట్లను 'బల్క్ డిపాజిట్లు'గా వర్గీకరణ
బల్క్ డిపాజిట్ల వడ్డీ రేట్లను ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు వెల్లడించడం తప్పనిసరి
సాధారణ, రిటైల్ డిపాజిటర్లపై ఈ మార్పుల ప్రభావం దాదాపుగా ఉండదు
బ్యాంకింగ్ వ్యవస్థలో పారదర్శకత పెంచడమే ఈ నిబంధనల ముఖ్య ఉద్దేశం

న్యూఢిల్లీ,సెప్టెంబర్25,సామాన్యుడి అస్త్రం

దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థలో పారదర్శకతను పెంచే దిశగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (=దీ×) మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లకు (ఖీణ) సంబంధించి కొత్త నిబంధనలను జారీ చేసింది. ఈ మార్పులు 2026 అక్టోబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రధానంగా రూ.3 కోట్లు, అంతకంటే ఎక్కువ విలువైన 'బల్క్ డిపాజిట్ల'ను లక్ష్యంగా చేసుకుని ఈ మార్గదర్శకాలను రూపొందించారు. సాధారణ, చిన్న మొత్తాల్లో డిపాజిట్లు చేసే రిటైల్ కస్టమర్లపై ఈ నిబంధనల ప్రభావం దాదాపుగా ఉండదని ఆర్బీఐ స్పష్టం చేసింది.

ఏమిటీ కొత్త మార్పులు?

ఆర్బీఐ తాజా నిబంధనల ప్రకారం, ఇకపై రూ.3 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ మొత్తంలో చేసే సింగిల్ టర్మ్ డిపాజిట్‌ను 'బల్క్ డిపాజిట్'గా పరిగణిస్తారు. ఇప్పటివరకు ఈ పరిమితి తక్కువగా ఉండేది. ఈ బల్క్ డిపాజిట్లపై వేర్వేరు వడ్డీ రేట్లను (డిఫరెన్షియల్ రేట్స్) ఆఫర్ చేసేందుకు బ్యాంకులకు మరింత వెసులుబాటు కల్పించారు. లిక్విడిటీ కవరేజ్ రేషియో (గజ=) ఫ్రేమ్‌వర్క్‌కు అనుగుణంగా, తమ అవసరాలకు తగ్గట్టుగా వడ్డీ రేట్లను నిర్ణయించుకునే స్వేచ్ఛను బ్యాంకులకు ఇచ్చారు.

పారదర్శకతకు పెద్దపీట

ఈ కొత్త నిబంధనల్లో అత్యంత ముఖ్యమైన అంశం పారదర్శకత. ప్రతి బ్యాంకు తమ ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లను తమ అధికారిక వెబ్‌సైట్‌లో స్పష్టంగా ప్రదర్శించాలి. ముఖ్యంగా, బల్క్ డిపాజిట్లపై అందించే వడ్డీ రేట్లను ప్రతిరోజూ ఉదయం 10 గంటలలోపు తప్పనిసరిగా అప్‌డేట్ చేయాలి. ఉదయం 10:10 గంటల కల్లా ఈ కొత్త రేట్లు వెబ్‌సైట్‌లో వినియోగదారులకు కనిపించాలని ఆర్బీఐ ఆదేశించింది. దీనివల్ల పెద్ద డిపాజిటర్లకు వడ్డీ రేట్లపై రోజువారీ స్పష్టత లభిస్తుంది.

వివక్షకు తావు లేదు

మరో కీలకమైన నిబంధన ప్రకారం, ఒకే బ్యాంకుకు చెందిన వేర్వేరు బ్రాంచ్‌లలో వడ్డీ రేట్లపై వివక్షకు తావు లేకుండా చేశారు. ఒక నిర్దిష్ట రోజున, ఒకే మొత్తంలో చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై దేశవ్యాప్తంగా ఆ బ్యాంకుకు చెందిన అన్ని బ్రాంచ్‌లలోనూ ఒకే వడ్డీ రేటును అమలు చేయాలి. అంటే, ఒకే రోజు ఒకే బ్యాంకులో ఒకే మొత్తానికి ఎఫ్‌డీ చేసే ఇద్దరు వేర్వేరు వ్యక్తులకు వేర్వేరు వడ్డీ రేట్లు ఆఫర్ చేయడానికి వీలుండదు.

సామాన్యులపై ప్రభావం ఉండదు

ఈ మార్పులు ప్రధానంగా పెద్ద కార్పొరేట్ సంస్థలు, అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు చేసే బల్క్ డిపాజిట్ల కోసమేనని ఆర్బీఐ తెలిపింది. సాధారణ ప్రజలు, మధ్యతరగతి ప్రజలు చేసే చిన్న మొత్తాల డిపాజిట్లపై ఈ నిబంధనల ప్రభావం ఏమాత్రం ఉండదు. ప్రస్తుతం బ్యాంకులను బట్టి 6 శాతం నుంచి 7 శాతం వరకు ఎఫ్‌డీలపై వడ్డీ లభిస్తుండగా, సీనియర్ సిటిజన్లకు అదనపు ప్రయోజనాలు కొనసాగుతాయి. సురక్షితమైన పెట్టుబడి మార్గాల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఇప్పటికీ తమ ప్రాధాన్యతను నిలుపుకుంటాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు

వారంలో బిహార్‌లో మూడో ఘటన.

న్యూఢిల్లీ,సెప్టెంబర్25,సామాన్యుడి అస్త్రం

బిహార్‌లో యువతుల వేధింపులకు సంబంధించిన వీడియోలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. జముయి, సమస్తిపూర్ జిల్లాల్లో ఇలాంటి ఘటనలు వెలుగుచూసిన కొన్ని రోజులకే.. ఇప్పుడు బంకా జిల్లాలో మరో వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో వారం రోజుల్లోనే బిహార్‌లో ఇది మూడో ఘటనగా నిలిచింది. ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.బంకా జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం మందార్ హిల్‌లో ఓ యువతిని కొందరు యువకులు వేధిస్తున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. ఈ వీడియో గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నట్లు పోలీసులు తెలిపారు. సోషల్ మీడియా సెల్‌కు వాట్సాప్ ద్వారా వీడియో అందడంతో అధికారులు దృష్టి సారించారు.బౌన్సీ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో పంకజ్ కుమార్ ఝా ఆధ్వర్యంలో పోలీసులు మందార్ హిల్‌కు వెళ్లి ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. వీడియో మందార్ హిల్‌లోనే చిత్రీకరించినట్లు ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారించారు. అయితే వీడియో ఇటీవలిది కాదని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటన ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్నారు

బరువు తగ్గడం నుంచి గుండె ఆరోగ్యం వరకు...

ఫైబర్‌తో ఎన్నో లాభాలు!

జీర్ణక్రియను మెరుగుపరిచే ఫైబర్
గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర
బరువు నియంత్రణ, షుగర్ లెవెల్స్ కంట్రోల్‌కు సహాయం
పప్పులు, పండ్లు, కూరగాయలలో పుష్కలంగా లభ్యం
ఫైబర్ తీసుకునేటప్పుడు తగినన్ని నీళ్లు తాగడం తప్పనిసరి

ఆధునిక జీవనశైలిలో ఆరోగ్యంగా ఉండటం ఒక సవాలుగా మారింది. సరైన ఆహారపు అలవాట్లతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఆరోగ్య నిపుణులు పదేపదే చెబుతున్నారు. మనం తీసుకునే ఆహారంలో కీలక పాత్ర పోషించే వాటిలో ఫైబర్ (పీచుపదార్థం) ఒకటి. ఇది మన శరీరం పూర్తిగా జీర్ణం చేసుకోలేని ఒక రకమైన కార్బోహైడ్రేట్ అయినప్పటికీ, దీనివల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు. దీర్ఘకాలిక వ్యాధుల ముప్పును తగ్గించడంలో ఫైబర్ ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది.



ఫైబర్ వల్ల కలిగే ప్రధాన ప్రయోజనాలు

ఫైబర్ ప్రధానంగా జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. ఇది మలానికి బరువును జోడించి, పేగుల కదలికలను సులభతరం చేస్తుంది. తద్వారా ఎంతోమందిని వేధించే మలబద్ధకం సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుంది. అంతేకాకుండా, ఓట్స్, పప్పుధాన్యాలలో ఉండే కరిగే ఫైబర్ (సాల్యూబుల్ ఫైబర్) రక్తంలోని చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది పేగులలో కొలెస్ట్రాల్ శోషణను అడ్డుకోవడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది.మధుమేహంతో బాధపడేవారికి ఫైబర్ ఒక వరం లాంటిది. ఇది ఆహారంలోని కార్బోహైడ్రేట్ల జీర్ణక్రియను, గ్లూకోజ్ శోషణను నెమ్మదింపజేస్తుంది. ఫలితంగా రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగకుండా నియంత్రణలో ఉంటాయి. ఇక బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఫైబర్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఫైబర్ అధికంగా ఉండే ఆహారం తీసుకున్నప్పుడు కడుపు ఎక్కువసేపు నిండిన భావన కలుగుతుంది. దీంతో అనవసరంగా తినాలనే కోరిక తగ్గి, బరువు నియంత్రణ సులభమవుతుంది. అలాగే, పేగులలోని మంచి బ్యాక్టీరియాకు ఆహారంగా పనిచేసి, వాటి ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

ఏ పదార్థాలలో ఫైబర్ అధికం?

పప్పులు, శనగలు, రాజ్మా వంటి పప్పుధాన్యాలు, జామ, యాపిల్, నారింజ వంటి పండ్లు, క్యారెట్, బ్రకోలీ, చిలగడదుంప వంటి కూరగాయలలో ఫైబర్ పుష్కలంగా లభిస్తుంది. వీటితో పాటు ఓట్స్, చియా గింజలు, అవిసె గింజలు, బాదం వంటి వాటిని కూడా రోజూ ఆహారంలో చేర్చుకోవడం మంచిది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఒక్కసారిగా అధిక మోతాదులో ఫైబర్ తీసుకోవడం వల్ల కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు తలెత్తవచ్చు. కాబట్టి, ఆహారంలో ఫైబర్ మోతాదును క్రమంగా పెంచుకుంటూ వెళ్లాలి. ఫైబర్ తీసుకునేటప్పుడు తప్పనిసరిగా రోజూ తగినంత నీరు తాగడం చాలా ముఖ్యం. ఆరోగ్య నిపుణుల ప్రకారం, పెద్దలు రోజుకు సుమారు 25 నుంచి 38 గ్రాముల ఫైబర్ తీసుకోవడం ఆరోగ్యానికి శ్రేయస్కరం.

ఆరోగ్యానికి సహజ రక్షణ ఇచ్చే ఫలం ఇదే... ఎలా తినాలో తెలుసుకోండి!



పోషకాల గనిగా పేరుపొందిన అంజీర్ పండ్లు
గుండె, ఎముకల ఆరోగ్యానికి ఎంతో మేలు
రాత్రంతా నీటిలో నానబెట్టి తినడం శ్రేయస్కరం
మధుమేహం ఉన్నవారు మితంగా తీసుకోవాలని సూచన
రోజుకు 2 నుంచి 4 పండ్లు తినడం ఉత్తమం

మన ఆహారపు అలవాట్లలో చిన్న చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అలాంటి వాటిలో అంజీర్ (ఫిగ్స్) పండ్లను చేర్చుకోవడం ఎంతో మేలు చేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పోషకాల గనిగా పేరుపొందిన అంజీర్, శరీరానికి సహజమైన రక్షణ కవచంలా పనిచేస్తుంది.అంజీర్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, మెగ్నీషియం వంటి పోషకాలు గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి. ఇవి ఎముకలను దృఢంగా మార్చడంతో పాటు, కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. మెదడు పనితీరును మెరుగుపరిచి, జ్ఞాపకశక్తిని పెంచడంలో కూడా అంజీర్ కీలక పాత్ర పోషిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచడం, చర్మాన్ని కాంతివంతంగా మార్చడం వంటి ప్రయోజనాలు కూడా ఉన్నాయి.

ఎలా తీసుకోవాలి?

రెండు లేదా మూడు ఎండు అంజీర్ పండ్లను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయాన్నే తినడం ఉత్తమమైన పద్ధతి. దీనివల్ల శరీరం పోషకాలను సులభంగా గ్రహిస్తుంది. అలాగే ఓట్స్, పెరుగు, స్మూతీలు లేదా సలాడ్లలో కలిపి కూడా తీసుకోవచ్చు.

జాగ్రత్తలు తప్పనిసరి

అయితే, అంజీర్‌ను మితంగా తీసుకోవడం చాలా ముఖ్యం. సాధారణంగా రోజుకు 2 నుంచి 4 పండ్లు సరిపోతాయి. ఎక్కువగా తింటే గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తవచ్చు. మధుమేహం ఉన్నవారు వైద్యుల సలహాతో రోజుకు ఒకటి లేదా రెండు పండ్లకు మించి తీసుకోకపోవడం మంచిది.

కీరదోస తింటే అనారోగ్యమా? ఈ విషయాలు తెలుసుకోండి..!

కీరదోసతో ఆరోగ్యానికి మేలు
కొందరికి జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం
చేదు కీరదోస తినొద్దు
కొందరికి ఫుడ్ పాయిజనింగ్ ప్రమాదం
అరుదుగా అలర్జీ రావచ్చు

ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా చాలా మంది కీరదోసకాయను తమ డైట్‌లో చేర్చుకుంటున్నారు. క్యారట్, బీట్‌రూట్‌తో పాటు దీన్నీ పచ్చిగా తినేందుకు ఆసక్తి చూపిస్తారు. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునేవారు కచ్చితంగా తింటున్నారు. ఇందులో ఫైబర్, నీటి శాతం ఎక్కువగా ఉండటంతో కడుపు నిండిన భావన కలుగుతుంది. తరచూ ఏదో ఒకటి తినాలనే కోరిక తగ్గుతుంది. దీంతో క్యాలరీల వినియోగం తగ్గి బరువు నియంత్రణకు తోడ్పడుతుంది. అయితే కీరదోసకాయ అందరికీ ఒకేలా సరిపోదని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొందరిలో కొన్ని ఆరోగ్య సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉందంటున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.



జీర్ణకోశ సమస్యలు

కీరలో ఉండే పీచు పదార్థాలు, సహజ రసాయనాలు కొందరిలో కడుపు ఉబ్బరం, గ్యాస్, కడుపు నొప్పి, అజీర్ణం వంటి సమస్యలకు దారితీయవచ్చు. ముఖ్యంగా జీర్ణకోశం సున్నితంగా ఉండేవారు ఎక్కువ పరిమాణంలో తింటే ఈ ఇబ్బందులు కనిపించే అవకాశం ఉంటుంది.

చేదుగా ఉంటే జాగ్రత్త

కొన్నిసార్లు దోసకాయ సాధారణం కంటే మరీ చేదుగా ఉంటుంది. దీనికి 'కుకుర్బిటాసిన్స్' అనే సహజ రసాయనాలే కారణం. స్వల్ప మోతాదులో ఇవి ప్రమాదకరం కాకపోయినా, ఎక్కువగా ఉన్న కీర తింటే వికారం, వాంతులు, కడుపు నొప్పి, విరేచనాలు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే చేదుగా అనిపించిన దోసను వెంటనే పారేయడం మంచిది.

ఫుడ్ పాయిజనింగ్

ఇతర పచ్చి కూరగాయల్లాగే కీరపై కూడా హానికర బ్యాక్టీరియా చేరే అవకాశం ఉంటుంది. సరిగా కడగకుండా లేదా పరిశుభ్రంగా నిల్వ చేయకుండా తింటే ఫుడ్ పాయిజనింగ్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. అలాంటి సమయంలో విరేచనాలు, జ్వరం, వాంతులు, కడుపు మంట, వికారం వంటి లక్షణాలు కనిపించవచ్చు.

అలర్జీ కూడా రావచ్చు

కీరతో అలర్జీ వచ్చే వారు చాలా తక్కువే. అయినా కొందరిలో నోరు, గొంతులో దురద, పెదవులు లేదా నాలుక వాపు, చర్మంపై దద్దుర్లు, గొంతు మంట వంటి లక్షణాలు కనిపించవచ్చు. తీవ్రమైన లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

తరచూ మూత్ర విసర్జన

దోసకాయలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. అందుకే అధికంగా తింటే సాధారణం కంటే ఎక్కువసార్లు మూత్ర విసర్జన కావచ్చు. ఆరోగ్యంగా ఉన్నవారికి ఇది పెద్ద సమస్య కాదు. కానీ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యుల సూచనలు పాటించడం మంచిది.

ఇలా తింటే సేఫ్

కీరదోసకాయ తినే ముందు బాగా కడగాలి. శుభ్రమైన, చల్లని ప్రదేశంలో నిల్వ చేయాలి. చేదు రుచి ఉన్న కీర తినకూడదు. మితంగా తీసుకోవాలి. జీర్ణకోశ సమస్యలు ఉన్నవారు తొక్క తీసి తింటే మంచిది.

వయసుపై కొత్త నిజాలు.. ఈ వయసుల్లోనే వృద్ధాప్యం వేగవంతం!



వృద్ధాప్యం ఒకేలా సాగదు, కొన్ని వయసుల్లో వేగవంతం అవుతుంది
ముఖ్యంగా 44, 50, 60 ఏళ్లలో శరీరంలో మార్పులు చాలా వేగంగా జరుగుతాయి
స్టాన్‌ఫర్డ్, చైనా శాస్త్రవేత్తల పరిశోధనల్లో ఈ విషయాలు వెల్లడి
నడివయసులో జీవక్రియ, గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయన్న నిపుణులు
ఈ దశల్లో సరైన జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచన

వయసు పెరిగే ప్రక్రియ (వృద్ధాప్యం) నిరంతరం ఒకే వేగంతో సాగదని, కొన్ని నిర్దిష్ట వయసుల్లో జీవ సంబంధిత మార్పులు వేగవంతం అవుతాయని తాజా శాస్త్రీయ పరిశోధనలు తేల్చాయి. ముఖ్యంగా 44, 50, 60 ఏళ్ల వయసులో శరీరంలో కీలక మార్పులు వేగంగా చోటుచేసుకుంటాయని స్టాన్‌ఫర్డ్ మెడిసిన్, చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మార్పులు జీవక్రియ, గుండె ఆరోగ్యం, రోగనిరోధక శక్తి, అవయవాల పనితీరుపై ప్రభావం చూపుతాయి.స్టాన్‌ఫర్డ్ మెడిసిన్ నిర్వహించిన ఒక అధ్యయనంలో, 25 నుంచి 75 ఏళ్ల వయసు వారిలో దాదాపు 1,35,000 అణువులు, సూక్ష్మజీవులను విశ్లేషించారు. 40వ పడి మధ్యలో, 60 ఏళ్ల సమీపంలో శరీరంలో రెండు ప్రధాన మార్పుల దశలు ఉన్నట్లు గుర్తించారు. ఈ సమయంలో జీవక్రియ, కొలెస్ట్రాల్, మూత్రపిండాలు, రోగనిరోధక వ్యవస్థ పనితీరులో మార్పులు గమనించారు. మరోవైపు, చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జరిపిన పరిశోధనలో 50 ఏళ్ల వయసును ఒక కీలక మలుపుగా గుర్తించారు. ఈ వయసు తర్వాత అనేక అవయవాలు, ముఖ్యంగా రక్తనాళాల పనితీరు వేగంగా క్షీణించడం మొదలవుతుందని వెల్లడైంది.స్టాన్‌ఫర్డ్ అధ్యయనానికి నేతృత్వం వహించిన డాక్టర్ మైఖేల్ స్నైడర్ మాట్లాడుతూ, "శరీరంలో మార్పులు క్రమంగా కాకుండా, కొన్నిసార్లు నాటకీయంగా ఉంటాయి" అని వివరించారు. 40 ఏళ్లలో బరువు పెరగడం, వ్యాయామం తర్వాత కోలుకోవడానికి ఎక్కువ సమయం పట్టడం వంటివి ఈ మార్పుల వల్లే జరుగుతాయని నిపుణులు అంటున్నారు.ఈ పరిశోధనల ప్రకారం, వ్యాధులు వస్తాయని భయపడాల్సిన అవసరం లేదని, అయితే నడివయసు నుంచే సరైన జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యమని వైద్యులు సూచిస్తున్నారు. కండరాలను కాపాడుకోవడానికి వ్యాయామం, క్రమం తప్పకుండా రక్తపోటు, కొలెస్ట్రాల్, షుగర్ స్థాయిలను పర్యవేక్షించుకోవడం, తగినంత నిద్ర, ఒత్తిడిని తగ్గించుకోవడం, మద్యపానాన్ని పరిమితం చేయడం వంటి చర్యల ద్వారా ఆరోగ్యకరమైన జీవనాన్ని గడపవచ్చని వారు సలహా ఇస్తున్నారు.

ఆవు నెయ్యితో ఆశ్చర్యకరమైన ప్రయోజనాలు!

ఆవు నెయ్యి ఆరోగ్య ప్రయోజనాలపై పెరుగుతున్న ఆసక్తి
జీర్ణక్రియ మెరుగుపరచడం, బరువు నియంత్రణలో సహాయం
విటమిన్ ఏ, బ్యూట్రిక్ యాసిడ్ వంటి పోషకాలతో సంపూర్ణం
అధికంగా కాకుండా మితంగా వాడాలంటున్న నిపుణులు
గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని అధ్యయనాల వెల్లడి

రియల్ అడ్వైజర్ న్యూస్

భారతీయ గృహాల్లో, ముఖ్యంగా వంటింట్లో ఆవు నెయ్యికి విశిష్ట స్థానం ఉంది. కేవలం వంటకాలకే పరిమితం కాకుండా, తరతరాలుగా దీనిని సంప్రదాయ వైద్యంలోనూ విరివిగా ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం ఆవు నెయ్యిలోని ఆరోగ్య ప్రయోజనాలపై సర్వత్రా ఆసక్తి పెరుగుతోంది. ఆయుర్వేద నిపుణులతో పాటు ఆధునిక శాస్త్రవేత్తలు సైతం నెయ్యి వినియోగం వల్ల కలిగే మేలును విశ్లేషిస్తున్నారు. ఈ మేరకు 'టైమ్స్ ఆఫ్ ఇండియా' ఓ కథనం వెలువరించింది.మితంగా ఆవు నెయ్యిని తీసుకోవడం వల్ల బరువును నియంత్రించవచ్చని, శరీరంలో వాపులు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, హృదయ ఆరోగ్యానికి కూడా దోహదపడుతుంది. ఇందులో పుష్కలంగా ఉండే కాంజుగేటెడ్ లినోలెయిక్ యాసిడ్, బ్యూట్రిక్ యాసిడ్, విటమిన్-ఏ వంటి పోషకాలే ఈ విశిష్ట గుణాలకు కారణమని విశ్లేషిస్తున్నారు.పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం, నెయ్యి జీర్ణ వ్యవస్థను ఉత్తేజపరిచి, ఆహారంలోని పోషకాలను శరీరం సులభంగా గ్రహించేలా చేస్తుంది. అజీర్తి, మలబద్ధకం వంటి సమస్యలతో సతమతమయ్యే వారికి ఇది




ఎంతగానో మేలు చేస్తుంది. అయితే, కేవలం రుచి కోసం తగిన మోతాదులో మాత్రమే వాడాలని, అతిగా వాడటం శ్రేయస్కరం కాదని వారు స్పష్టం చేస్తున్నారు.నెయ్యిలో ఉండే 'బ్యూట్రేట్' అనే ఫ్యాటీ యాసిడ్ పేగుల ఆరోగ్యానికి తోడ్పడటంతో పాటు ఇన్ఫెక్షన్లను నివారిస్తుందని పలు అధ్యయనాలు వెల్లడించాయి. అయితే ఈ ప్రయోజనాలన్నీ మితమైన వినియోగంతోనే సాధ్యమని గుర్తించాలి. నెయ్యిలో కొవ్వు శాతం అధికంగా ఉండటం వల్ల అతిగా తీసుకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు నెయ్యిని తమ ఆహారంలో చేర్చుకునే ముందు వైద్యుల సలహా తీసుకోవడం ఉత్తమం. మొత్తానికి, మన సంప్రదాయ ఆహారపు అలవాట్లలో అంతర్భాగమైన ఆవు నెయ్యిని పరిమితంగా తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేసే వరమని చెప్పవచ్చు.

ధనుష్ సరసన

లీవుడ్ స్టార్ హీరో ధనుష్ కథానాయకుడిగా 'డీ56' అనే వర్కింగ్ టైటిల్‌తో కొత్త సినిమా పూజా కార్యక్రమాలు శుక్రవారం జరిగాయి. ఇటీవలే కోలీవుడ్‌లో 'లబ్బర్ పందు' చిత్రంతో సంచలన విజయాన్ని అందుకున్న దర్శకుడు తమిళరసన్ పచ్చముత్తు ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు.సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ప్రైమ్‌మార్క్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఈ భారీ పాన్-ఇండియా ప్రాజెక్టును నిర్మిస్తున్నాయి. తాజా పూజా కార్యక్రమాల సందర్భంగా చిత్ర యూనిట్ భారీ తారాగణాన్ని ప్రకటించింది. ఇందులో ధనుష్ సరసన కథానాయికగా ప్రీతి ముకుందన్(నటిస్తుండగా.. విలక్షణ నటుడు ఎస్‌జే సూర్య, ప్రముఖ హాస్య నటుడు వడివేలు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'ఉరియడి' ఫేమ్ విజయ్‌కుమార్ ఈ సినిమాలో ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. కోలీవుడ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారుపక్కా రూరల్ బ్యాక్‌డ్రాప్ మాస్ అండ్ హై-వోల్టేజ్ కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, ఇది 'పుష్ప' తరహాలో సాగే ఊరమాస్ ట్రీట్‌మెంట్‌తో, భారీ యాక్షన్, వయొలెన్స్ ఎలిమెంట్స్‌తో కూడిన పవర్‌ఫుల్ స్క్రిప్టుతో రాబోతోంది.ఈ చిత్రాన్ని 2027 వేసవి కానుకగా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇదిలావుండగా, ప్రీతి ముకుందన్.. స్టార్ హీరో ధనుష్ సరసన నటించే ఛాన్స్ దక్కించుకోవడంతో యంగ్ హీరోయిన్ పేరు ప్రస్తుతం సోషల్ మీడియాలో మారుమోగిపోతోంది. ఈ కాంబినేషన్‌పై ఇటు ధనుష్ అభిమానుల్లో, అటు సినిమా వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.




రిలీజ్ డేట్‌పై రూమర్స్‌కు చెక్



విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినిమాకు రిలీజ్ డేట్ ఖరారైంది. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా టీ-సిరీస్ సమర్పణలో రూపొందుతోంది. 'రణబాలి' విడుదలపై వస్తున్న వాయిదా వార్తలకు చెక్ పెడుతూ మేకర్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో వీరతిలకంతో యోధుడి గెటప్‌లో విజయ్ దేవరకొండ(ఆకట్టుకుంటున్నారు. తన ప్రజలు, మాతృభూమి కోసం పోరాడే రణబాలి పాత్రలో విజయ్ కనిపించనున్నట్లు చిత్ర బృందం తెలిపింది

వెండితెరపై చందమామలాంటి అందం

వెండితెరపై విరిసిన కలువనే 'కయాదు లోహర్' అనేది కుర్రాళ్లు చెప్పుకునే మాట. తమన్నా తరువాత 'మిల్కీ బ్యూటీ' అనే మాట ఏ హీరోయిన్ విషయంలో వాడొచ్చునా అనే ప్రశ్నకి ఆన్సర్ గా కనిపించే రూపమే కయాదు లోహర్. తమన్నాతో పోటీపడే మేనిఛాయతో ఎంట్రీ ఇచ్చిన ఈ సుందరి, అభిమానులను పెద్ద సంఖ్యలో సంపాదించుకోవడానికి ఎక్కువ సమయం తీసుకోలేదు. చక్కని కనుముక్కుతీరుతో పాటు అందుకు తగిన అభినయంతో ఈ బ్యూటీ ఆకట్టుకుంటూ వెళుతోంది. వరుస సినిమాలతో మరింత బిజీ అవుతోంది. సాధారణంగా ఒక భాషలో బిజీ అయిన తరువాతనే హీరోయిన్స్ మరో భాషలోకి ఎంట్రీ ఇస్తుంటారు. అలా కాకుండా వరుసగా వివిధ భాషల్లో అవకాశాలను సంపాదించుకోవడం చాలా తక్కువ మంది హీరోయిన్స్ విషయంలో జరుగుతూ ఉంటుంది. అలాంటి ఒక అరుదైన ఫీట్ కయాదు లోహర్ కూడా సాధ్యం చేసింది. కన్నడ సినిమాతో తన కెరియర్ ను మొదలుపెట్టిన ఈ చందమామ లాంటి అమ్మాయి, తెలుగు .. తమిళ .. మలయాళ .. మరాఠీ భాషలకు పరిచయం కావడానికి ఎక్కువ సమయం తీసుకోకపోవడం విశేషం.



'కాకా'పై బిగ్ అప్‌డేట్!

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'కాకా'(సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి. సినిమా షూటింగ్ కొనసాగుతుండగానే మరోవైపు డబ్బింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా మేకర్స్ వేగంగా పూర్తి చేస్తున్నారు. దీంతో అనుకున్న సమయానికి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి టీమ్ పక్కా ప్లానింగ్‌తో ముందుకెళ్తున్నట్లు తెలుస్తోంది.



ఏందయ్యా సామి.. ఈ ఫీలింగ్!

టాలీవుడ్ మోస్ట్ క్యూట్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న(పెళ్లి తర్వాత కూడా తమ కెమిస్ట్రీతో సోషల్ మీడియాను షేక్ చేస్తు న్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉదయ్‌పుర్ వేదికగా వైభవంగా వివాహం చేసుకున్న ఈ జంట, ప్రస్తుతం వెండితెరపై కూడా సందడి చేయడానికి సిద్ధమవుతోంది. వీరిద్దరూ కలిసి నటిస్తున్న తాజా పీరియా డిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' అక్టోబర్ 16న విడుదల కానుంది.ఈ నేపథ్యంలో ఇటీవలే ఈ సినిమాలోని 'ఏందయ్య సామి' అనే రొమాంటిక్ సాంగ్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ పాట తాలూకు చిన్న క్లిప్‌ను రష్మిక తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేస్తూ భర్త విజయ్‌పై ఉన్న ప్రేమను చాటుకు న్నారు. 'విజూ పూర్తిగా నావాడే అయినప్పటికీ.. ఆయనను చూస్తుంటే నాలో క్రష్ ఫీలింగ్ అస్సలు తగ్గడం లేదు. ఇది నిజంగా విచిత్రంగా ఉంది" అంటూ తన భర్త విజయ్ దేవర కొండపై తనకున్న అమితమైన ప్రేమను వ్యక్తపరిచారు.దీనికి విజయ్ అంతే ప్రేమగా స్పందిస్తూ.. 'నేను చాలా అదృష్టవం తుడిని. సినిమాలో 'జయమ్మ' పాత్రను నేను మిస్ అవుతాను కానీ, జీవితాంతం నువ్వు నా తోడుగా ఉంటావుగా' అని రీపోస్ట్ చేశారు. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' చిత్రాల తర్వాత విజయ్, –రష్మిక



కాంబోలో వస్తున్న మూడో చిత్రం కావడంతో 'రణబాలి'పై భారీ అంచనాలున్నాయి. రాహుల్ సాంకృ త్యాన్ దర్శక త్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం 1870ల నాటి మద్రాస్ కరవు నేపథ్యంలో సాగే పోరాట కథగా తెరకెక్కుతోంది. పెళ్లి తర్వాత ఈ జంట నటిస్తున్న మొదటి సినిమా కావడంతో ప్రేక్షకులు థియేటర్లలో వీరి ఆన్‌స్క్రీన్ మ్యాజిక్‌ను చూడటానికి ఎంతగానో ఎదురు చూస్తున్నారు.

'జైజై రామ్' తెలుగు సాంగ్ రిలీజ్



బాలీవుడ్‌లో భారీ అంచనాలతో తెరకెక్కుతున్న 'రామాయణ' సినిమాపై మరో ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం నుంచి 'జైజై రామ్' తెలుగు పాట విడుదలైంది. నితీష్ తివారి దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోందిఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడి పాత్రలో, సాయి పల్లవి సీత పాత్రలో కనిపించనున్నారు. మరోవైపు యశ్ రావణుడిగా కీలక పాత్ర పోషిస్తున్నారు. దీంతో ఈ పౌరాణిక కథా చిత్రంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. భారీ స్థాయిలో రూపొందుతున్న లిలి'రామాయణ'లిలిను నవంబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. తెలుగు 'జైజై రామ్' పాట విడుదలతో సినిమాపై టాలీవుడ్ ప్రేక్షకుల్లోనూ ఆసక్తి మరింత పెరిగింది.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.